తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం-12- నవంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 164 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## గచ్చిబౌలిలో సంధ్యా శ్రీధర్‌రావుకు

# హైకోర్టు చుక్కెదురు

- ఎఫ్‌సీఐ లే ఔట్ రహదారుల ఆక్రమణపై తీవ్ర వ్యాఖ్యలు
- బాధిత ప్లాట్ యజమానులకు అండగా ఉంటామని హైకోర్టు హామీ
- రహదారులు, పార్కులను వెంటనే పునరుద్ధరించాలంటూ హైడ్రాకు ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):

గచ్చిబౌలిలోని ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే ఔట్‌లో జరిగిన భారీ రహదారి ఆక్రమణల వ్యవహారంపై హైకోర్టు మంగళవారం ఘాటుగా స్పందించింది. సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్‌రావు చేపట్టిన నిర్మాణాలను కోర్టు తీవ్రమైన ఉల్లంఘనగా పేర్కొంది.

మిగతా 2లో

# ముగిసిన జూబ్లీహిల్స్ పోలింగ్

- 407 పోలింగ్ కేంద్రాల్లో మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు
- సాయంత్రం 6 గంటల వరకు 48.42% ఓటింగ్ నమోదు
- మూడు ప్రధాన పార్టీల మధ్య ఉత్కంఠభరిత పోటీ
- 14న ఓట్ల లెక్కింపు – ప్రధాన అభ్యర్థుల భవితవ్యం నిర్ణయం




హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక పోలింగ్ మంగళవారం సాయంత్రం ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు 48.42 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. సాయంత్రం 6 గంటలలోపు క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించామని తెలిపారు. ఈ నెల 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. నెల రోజులుగా సాగిన ప్రచారానికి ముగింపు పలుకుతూ, మూడు ప్రధాన పార్టీల మధ్య ఉత్కంఠభరిత పోటీ చోటు చేసుకుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున నవీన్ యాదవ్, బీఆర్ఎస్ తరఫున మాగంటి గోపీనాథ్ భార్య సునీత, బీజేపీ తరఫున లంకల దీపక్ రెడ్డి పోటీ చేస్తున్నారు.

మిగతా 2లో

## డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆలస్యం పై

# కవిత ఆవేదన

- డిండి లిఫ్ట్ పూర్తైతే వేలాది కుటుంబాలకు లాభం
- ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఒత్తిడి చర్యలను పెంచుతాం

కిష్టరాయినిపల్లి, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):

జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలోని కిష్టరాయినిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించిన జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రాజెక్టు ఆలస్యం పై ఆవేదన వ్యక్తం చేశారు. డిండి లిఫ్ట్ పూర్తి అయితే వేలాది మంది రైతులు, బాధితులు తక్షణ లాభం పొందగలరిజనిగి, అందుకే ప్రాంతీయ ప్రజల పెద్ద మనసుతో ల్యాండ్ ఇచ్చిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు.

మిగతా 2లో



## జూబ్లీహిల్స్ పోలింగ్‌లో పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలపై కేసులు

- ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై పోలీసుల చర్య
- మధురానగర్, బోరబండ స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు నమోదు
- చట్టం ముందు అందరూ సమానం అని స్పష్టం చేసిన పోలీసులు




హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక పోలింగ్ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై హైదరాబాద్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పలువురు ప్రస్తుత ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్ర నాయక్, రాందాస్‌లపై రెండు కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా, బోరబండ పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్

మిగతా 2లో

## ఎగ్జిట్‌పోల్స్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యం

- బీఆర్ఎస్ సమీప పోటీలో – బీజేపీ దూరంలోనే..
- నవంబర్ 14న తుది ఫలితాలు వెలువడనున్నాయి

2లో







# ఫేక్ ఆఫర్ లెటర్లతో జాగ్రత్త

## హెచ్చరిస్తున్న తెలంగాణ పోలీస్

- తెలియని నంబర్ల నుంచి వచ్చే జాబ్ ఆఫర్ మెసేజ్‌లను నమ్మవద్దు
- జాబ్ కోసం ఎవరికి డబ్బులు పంపించొద్దు
- ఫేక్ ఆఫర్ లెటర్లను ఉపయోగించి మోసాలు పెరుగుతున్నాయి

హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):

ఆన్‌లైన్‌లో ఫేక్ జాబ్ ఆఫర్ల పేరుతో జరుగుతున్న మోసాలపై తెలంగాణ పోలీస్ హెచ్చరిక జారీ చేసింది. ఇటీవల సోషల్ మీడియాలో, మెసేజ్‌ల రూపంలో "మీరు ఎంపికయ్యారు", "ట్రైనింగ్ ఫీజు చెల్లించండి" అంటూ ప్రజలను మోసం చేసే ఘటనలు పెరుగుతున్నాయని పోలీసులు వెల్లడించారు.




మిగతా 3లో

# అక్షరయోధుడి పాడె మోసిన రేవంత్



### ప్రజాకవి అంతిమయాత్రలో భావోద్వేగంగా సీఎం
### వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, సాహిత్యప్రియులు
### అధికారిక లాంఛనాలతో ఘట్‌కేసర్‌లో అంత్యక్రియలు

హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ గీతం రచయిత, ప్రజా కవి, ఉద్యమ గళం అందెశ్రీ పార్థివ దేహానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అశ్రునివాళి అర్పించారు. సన్నిహిత మిత్రుడైన అందెశ్రీ ఆకస్మిక మరణం తన మనసును ముక్కలుగా చేసిందని ముఖ్యమంత్రి అన్నారు. ఘట్‌కేసర్‌లో జరిగిన అంతిమక్రియల్లో స్వయంగా పాల్గొని, పాడెను మోసి చివరి గౌరవం తెలిపారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతిరూపమైన అందెశ్రీ జీవితం, కవిత్వం గురించి సీఎం స్మరించుకున్నారు. జయశంకర్ స్టేడియం లాలాపేట్ నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ ఎన్ఎఫ్‌సీ నగర్ వరకు సాగింది. వేలాది అభిమానులు, సాహిత్యప్రేమికులు, ఉద్యమ కార్యకర్తలు కన్నీటి కన్నులతో వీడ్కోలు పలికారు. "జయజయహే తెలంగాణ" నినాదాలతో అంతిమ యాత్ర మార్మోగింది.

మిగతా 3లో




## అందెశ్రీ అంతిమయాత్రలో మంత్రి సీతక్క

హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రజా కవి అందెశ్రీ పార్థివ దేహానికి మంత్రి సీతక్క పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. కవిస్ఫూర్తిగా, ఉద్యమ గళంగా నిలిచిన అందెశ్రీ మరణం తాను తట్టుకోలేనిదని ఆమె తెలిపారు. "తెలంగాణ స్ఫూర్తిని పదాల్లో మలిచిన ఆ మహాకవి లేకపోవడం ఎంతో బాధాకరం" అని సీతక్క కన్నీటి కళ్లతో అన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చిన మంత్రి సీతక్క, ఈ దుఃఖ సమయంలో ధైర్యంగా ఉండాలని వారిని ప్రోత్సహించారు. తెలంగాణ ఆత్మకు అక్షరరూపం ఇచ్చిన వ్యక్తిగా అందెశ్రీ ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలుస్తారని పేర్కొన్నారు.

అంతిమయాత్రలో మంత్రి సీతక్కతో పాటు సహచర మంత్రి పొన్నం ప్రభాకర్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తార్నాక నుంచి ఘట్‌కేసర్ వరకు సాగిన అంతిమయాత్రలో "అమర్ రహే అందెశ్రీ" అంటూ నినాదాలు చేస్తూ సీతక్క ముందుండి నడిచారు.

జయజయహే తెలంగాణ స్ఫూర్తిని స్మరించుకుంటూ సీతక్క మాట్లాడుతూ.. "ఆయన కలం ఆగిపోయినా, ఆయన గళం తెలంగాణ గుండెల్లో ఎప్పటికీ ప్రతిధ్వనిస్తుంది" అన్నారు. ప్రజాకవిని వీడ్కోలు పలికిన ఆ క్షణాలు సాహిత్యలోకాన్ని కన్నీటి పర్యంతం చేశాయి.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: భొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ముగిసిన జూబ్లీహిల్స్ పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

వీరితో పాటు మరో 55 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 4 లక్షలకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించే అర్హత కలిగి ఉన్నారు. ఈ ఎన్నికలో 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, 139 ప్రాంతాల్లో మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 900 మంది సిబ్బందిని నియమించగా, భద్రతా వ్యవస్థను పటిష్టం చేయడానికి 139 డ్రోన్ కెమెరాలను వినియోగించారు. కొన్నిచోట్ల స్వల్ప ఉద్రిక్తతలు తలెత్తినా, పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈసారి పోలింగ్ సరళిని రియల్‌టైమ్‌లో పర్యవేక్షించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక యాప్ ఉపయోగించింది. ప్రతి రెండు గంటలకు ఒకసారి ప్రిసైడింగ్ అధికారులు ఓటింగ్ వివరాలను నమోదు చేశారు. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో ఓటింగ్ శాతం ఎప్పుడూ 50% దాటలేదని అధికారులు తెలిపారు. 2024లో 45.59%, 2023లో 47.58%, 2019లో 39.89%, 2018లో 45.59% మాత్రమే ఓటింగ్ నమోదు అయింది. ఈసారి పోలింగ్ శాతం పెంచేందుకు సమయాన్ని ఒక గంట పొడిగించారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులను బూత్‌లకు తరలించేందుకు పార్టీల నాయకులు పెద్ద ఎత్తున వాహనాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం శాంతియుతంగా ముగిసిందని, ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు 14న వెల్లడవుతాయని అధికారులు తెలిపారు.










## ఓటు వేసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

### కుటుంబ సమేతంగా పోలింగ్ బూత్‌కు హాజరు
### ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనది : రంగనాథ్

**హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):** జూబ్లీహిల్స్ శాసన సభ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికలో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధుర నగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ 132 వద్ద కుటుంబ సమేతంగా హాజరై ఓటు వేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

మీడియాతో మాట్లాడిన రంగనాథ్ ప్రజలందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు వృథా చేయకూడదని, సమాజంలో మార్పు కోరుకునే వారు ముందుగా ఓటు వేయాలని అన్నారు. "ఓటు మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. బాధ్యతగా, ఆలోచించి ఓటు వేయాలి" అని సూచించారు.

ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి రంగనాథ్ ప్రత్యేకంగా పిలుపునిచ్చారు. మొదట ఓటు వేసి, ఆ తర్వాత మిగతా పనులు చేసుకోవాలని సూచించారు. "ఓటు వేయడం ఒక్క కర్తవ్యం మాత్రమే కాదు, అది ఒక బాధ్యత. ప్రతి ఓటు మన సమాజ నిర్మాణానికి బలమైన అస్త్రం" అని ఆయన పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలలో ఉత్సాహం స్పష్టంగా కనిపిస్తోంది. హైడ్రా కమిషనర్ వంటి అధికారులు స్వయంగా ఓటు వేయడం ప్రజలకు ప్రేరణగా మారిందని పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న అధికారులు తెలిపారు.

## జూబ్లీహిల్స్ పోలింగ్‌లో పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలపై కేసులు

మెతుకు ఆనంద్‌లపై మరో కేసు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి సాక్ష్యాలు సేకరించారని పోలీసులు వెల్లడించారు. పోలింగ్ ప్రాంతాల్లో పార్టీ కార్యకలాపాలు, అనుమతిలేని ర్యాలీలు, ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైదరాబాద్ సిటీ పోలీసులు ప్రజాస్వామ్య ప్రక్రియను పరిరక్షించడం తమ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. "ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుతంగా జరగాలంటే ప్రతి ఒక్కరు చట్టానికి లోబడి వ్యవహరించాలి" అని హెచ్చరించారు. అలాగే, నియమావళిని ఉల్లంఘించినట్లు ఎవరైనా గమనిస్తే వెంటనే డయల్ 100 ద్వారా సమాచారమివ్వాలని పౌరులను కోరారు.

ఈ ఘటనల నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోలీసు పహారా మరింత పెంచారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో సీసీ కెమెరాల ద్వారా క్షుణ్ణంగా పర్యవేక్షణ కొనసాగుతోంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని సీనియర్ అధికారుల ఆదేశాలు జారీ అయ్యాయి.

## ఎగ్జిట్‌పోల్స్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యం

**హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ ముగియడంతో ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు వెలువడ్డాయి. మూడు ప్రధాన పార్టీల మధ్య జరిగిన ఈ త్రిముఖ పోటీ రాజకీయ ఉత్కంఠను పెంచగా, ప్రాథమిక అంచనాలు కాంగ్రెస్ వైపే అనుకూలంగా ఉన్నట్లు సర్వేలు సూచిస్తున్నాయి. 5 గంటల వరకు పోలింగ్ 48.42 శాతంగా నమోదవగా, సాయంత్రం 6 గంటల లోపు క్యూలైన్‌లో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. HMR సర్వే ప్రకారం, కాంగ్రెస్‌కు 48.31 శాతం ఓట్లు రానున్నాయని అంచనా. బీఆర్ఎస్‌కు 43.18 శాతం, బీజేపీకి 5.84 శాతం ఓట్లు లభించే అవకాశముంది. చాణక్య స్ట్రాటజీస్ అంచనాల ప్రకారం కూడా కాంగ్రెస్



46 శాతం, బీఆర్ఎస్ 43 శాతం, బీజేపీ 6 శాతం ఓట్లు సాధించవచ్చని తెలిపింది. ఇదే తరహాలో స్మార్ట్ పోల్ సర్వే కూడా కాంగ్రెస్‌ను ముందంజలో ఉంచింది. ఆ సర్వేలో కాంగ్రెస్ 48.2 శాతం, బీఆర్ఎస్ 42.1 శాతం, బీజేపీ 7.6 శాతం, ఇతరులకు 2.1 శాతం ఓట్లు పడతాయని అంచనా వేశారు. ఈ ఉపఎన్నికకు కారణమైన మాగంటి గోపినాథ్ మృతి తర్వాత ఆయన భార్య సునీత బీఆర్ఎస్ తరఫున బరిలోకి దిగగా, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్‌రెడ్డి పోటీ చేశారు. మూడు ప్రధాన పార్టీలు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. పోలింగ్ శాంతియుతంగా ముగియగా, ఓట్ల లెక్కింపు నవంబర్ 14న జరగనుంది. రాజకీయ విశ్లేషకులు చెబుతున్నదేమిటంటే నగర ఓటర్లలో యువత, మహిళల మద్దతు ఈసారి కాంగ్రెస్‌కు ఊతమిచ్చిందని, అయితే బీఆర్ఎస్ కూడా పట్టణ ఓటు బ్యాంక్‌ను రక్షించుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. చివరి ఫలితాలు కాంగ్రెస్ అంచనాలనూ నిలబెడతాయా, లేక బీఆర్ఎస్ తిరుగుబాటు చేస్తుందా అన్నది నవంబర్ 14న తేలనుంది.

## గచ్చిబౌలిలో సంధ్యా శ్రీధర్‌రావుకు హైకోర్టు చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)

"ఒకసారి లే ఔట్ ఆమోదించాక, దాని పరిమితులు మారవు. రహదారులు, పార్కులు వ్యక్తిగత ఆస్తులుగా మార్చుకోవడం చట్టానికి విరుద్ధం," అని జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి వ్యాఖ్యానించారు. హైడ్రా అధికారులు ఇప్పటికే రహదారులపై జరిగిన ఆక్రమణలను తొలగించిన విషయం విధితమే. అయితే ఆ చర్యలపై సంధ్యా శ్రీధర్‌రావు హైకోర్టును ఆశ్రయించడంతో కేసు మళ్లీ విచారణకు వచ్చింది. విచారణ సందర్భంగా హైకోర్టు ఆక్రమణల తీరుపై, స్థానికులపై చూపిన ఒత్తిడిపై ఘాటుగా వ్యాఖ్యలు చేసింది. న్యాయమూర్తి స్పష్టంగా పేర్కొంటూ—"సొసైటీ లే ఔట్ నియమాలను ఉల్లంఘించి నిర్మాణాలు జరపడం సరైంది కాదు. ప్రజల రహదారులు ఎవరి వ్యక్తిగత సొత్తు కావు" అని హెచ్చరించారు.

బాధిత ప్లాట్ యజమానులు కూడా ఈ సందర్భంగా కోర్టు ఎదుట తమ గోడును వ్యక్తపరిచారు. సంధ్యా శ్రీధర్‌రావు తన ప్రభావంతో తప్పుడు కేసులు పెట్టించడం, దాడులు చేయడం, తమ ప్లాట్లలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడం వంటి అనేక ఘటనలు జరిగినట్లు వివరించారు. అంతేకాకుండా, సుప్రీంకోర్టు కూడా ఇంతకుముందు సంధ్యా శ్రీధర్‌రావుపై రూ.10 లక్షల జరిమానా విధించిన విషయాన్ని వారు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. బాధితుల వాదనలను విన్న హైకోర్టు, హైడ్రా అధికారుల చర్యలను సమర్థిస్తూ, రహదారుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించింది. "ఈ కేసులో న్యాయం జరిగేలా హైకోర్టు పర్యవేక్షణ కొనసాగుతుంది. బాధితులకు న్యాయం చేయడం మా ధర్మం,"




అని జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి అన్నారు. హైడ్రా భూసర్వే చేసి రహదారుల పాత సరిహద్దులను గుర్తించి తిరిగి ఆరంభించాలనీ, పార్కులను యథాతథంగా పునరుద్ధరించాలని సూచించారు.

అంతేకాకుండా, సొసైటీ లే ఔట్‌లో పునరుద్ధరణకు అడ్డంకులు కల్పిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కూడా హైకోర్టు హెచ్చరించింది. "ప్రైవేట్ వ్యక్తులు పబ్లిక్ ప్రాపర్టీపై కన్నేసినప్పుడు ప్రభుత్వ యంత్రాంగం మూగబోయే పరిస్థితి రావద్దు," అని వ్యాఖ్యానించింది. రహదారుల పునరుద్ధరణ పూర్తయ్యే వరకు హైడ్రా అధికారులు నియమితంగా నివేదికలు సమర్పించాలని ఆదేశించింది. హైకోర్టు ఈ కేసు తుది విచారణను నవంబర్ 18కి వాయిదా వేసింది. అప్పటివరకు రహదారుల స్థితిగతులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని హైడ్రా అధికారులను ఆదేశించింది. గచ్చిబౌలి ప్రాంతంలో జరుగుతున్న ఈ కేసు, నగరంలో పెరుగుతున్న రియల్ ఎస్టేట్ ఆక్రమణలపై గట్టి హెచ్చరికగా నిలుస్తోందని న్యాయవర్గాలు అభిప్రాయపడ్డాయి.




## డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆలస్యం పై కవిత ఆవేదన

(మొదటి పేజీ తరువాయి)

2015లోనే ప్రాజెక్టు పూర్తయితేకూడా సమస్యలు ఉండేవి కాదు; కానీ పనులు ఏడాదులుగా ఆలస్యం అవుతున్నాయని, దాదాపు 11 ఏళ్లు ఆలస్యం కావడం వల్ల అప్పట్లో చిన్న వయసులో ఉన్న వ్యక్తులు ఇప్పుడు పెద్దవయస్కులు అయ్యారని, చాలా మందికి అప్పుడప్పుడు పరిహారం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదుంది అని ఆమె స్పష్టం చేశారు. అప్పటి ధరలు ప్రస్తుతం ఉన్న ధరలతో పోలిస్తే చాలా తేడా ఉందని, అందుకే సరైన పరిహారాలు ఇవ్వబడాల్సిన అవసరముంటుందన్నారు.

అంతే కాకుండా నిర్వాసితులకి ఇల్లు లేదా ప్రత్యామ్నాయ కాలనీలు కట్టి అందించకపోవడం, ప్రజలను తాత్కాలికంగా నిలిపి ఉంచడానికి చట్టం ప్రకారం నెలల ఖర్చు ఇవ్వాల్సిన అంశం కూడా అమలు కాకుండా ఉన్నదని కవిత ఉల్లేఖించారు. ప్రాజెక్టు సిబ్బంది, కాంట్రాక్టర్‌తో మాట్లాడినప్పుడు కూడా గత నాలుగు నెలలుగా ప్రభుత్వం యథావిధిగా డబ్బులు విడుదల చేయలేదని తెలియాల్సిందన్నారు. అందువల్ల పనులు ఇంకా ఆలస్యం అవుతాయనే పరిస్థితి కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు.

కవిత చెప్పినట్లుగా ప్రభుత్వాన్ని పదేపదే నిలబెట్టి ఈ నాలుగు ప్రధాన సమస్యలపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బాధితులకు తక్షణ పరిహారం, ఇళ్ల ఏర్పాట్లు, ప్రాజెక్టు పూర్తిస్థాయిలో పూర్తి చేయడంపై స్పష్టమైన తారీఖు కోరుతూ ఆమె హైదరాబాద్‌లో లేదా నల్గొండలో ఒక నిర్దిష్ట తేదీని నిర్ణయించి ప్రభుత్వాన్ని నిలబెడతామని హెచ్చరించారు.

## కాంగ్రెస్ అక్రమాలకు ఎన్నికల అధికారులు, పోలీసులు తోడ్పడుతున్నారని ఆరోపణ

- నిరసనకు దిగిన మాగంటి సునీత గోపీనాథ్
- దొంగ ఓట్లకు అధికార యంత్రాంగం సహకారం అంటూ బీఆర్ఎస్ ఆరోపణ

**హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ కాంగ్రెస్ నేతలు దొంగ ఓట్లకు పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ అక్రమాలకు ఎన్నికల కమిషన్, పోలీసులు సహకరిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతున్నారని, వారికి అధికారుల మద్దతు లభిస్తోందని సునీత తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచే కుట్ర జరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "మేము ఎన్నికల నియమాలు పాటిస్తున్నాం, కానీ కాంగ్రెస్ మాత్రం అక్రమాలకు పాల్పడుతోంది. ఎన్నికల కమిషన్ వెంటనే జోక్యం చేసుకోవాలి" అని ఆమె డిమాండ్ చేశారు.

ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు జూబ్లీహిల్స్‌లో నిరసనకు దిగారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. సునీత మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్ణయాధికారులు. కానీ అధికార యంత్రాంగం ఒక పార్టీకి వంగిపోతే ప్రజల నమ్మకం దెబ్బతింటుంది" అని అన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఉదయం నుంచి



పోలింగ్ శాంతియుతంగా సాగుతుండగా, మధ్యాహ్నం తర్వాత ఈ ఆరోపణలతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. పరిస్థితిని శాంతపరిచేందుకు అదనపు పోలీసు బలగాలను మోహరించారు.ఋ

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
బుధవారం-12- నవంబర్ 2025






# అక్షరయోధుడి పాడె మోసిన రేవంత్



(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ భూమి కోసం కలం పట్టిన ఆ కవి ఇక లేడన్న నిజం సాహిత్యలోకాన్ని కదిలించింది.
అందెశ్రీ సతీమణి మల్లుబాయి, కుమార్తెలు వాక్కులమ్మ, వెన్నెల, వేకువ, కుమారుడు దత్తు సంప్రదాయ పద్ధతిలో కర్మకాండలు నిర్వహించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులను ఓదార్చి, అందెశ్రీ కవిత్వం తెలంగాణ స్ఫూర్తిగా తరతరాలకు నిలుస్తుందని అన్నారు.
అంతిమయాత్రలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు వేంపల్లి నరేందర్ రెడ్డి, కేశవరావు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.
తెలంగాణ ఆత్మను పదబంధాలుగా మలిచిన కవిని వీడ్కోలు పలికే క్షణాలు హృదయాన్ని కదిలించాయి.
సాహిత్య సమరయోధుడిగా, ఉద్యమ కవిగా అందెశ్రీ కీర్తి ఎప్పటికీ నిలిచి ఉంటుంది. ఆయన రాసిన ప్రతి పాదం తెలంగాణ గుండెల్లో నిత్యమూ ప్రతిధ్వనిస్తుంది.



# ఫేక్ ఆఫర్ లెటర్లతో జాగ్రత్త



(మొదటి పేజీ తరువాయి)

తెలియని నంబర్ల నుంచి వచ్చే జాబ్ ఆఫర్‌లు, రిక్రూట్‌మెంట్ కాల్స్, ఈమెయిల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "జాబ్ కోసం ఎవరికి డబ్బులు ఇవ్వొద్దు, తెలియని లింకులు క్లిక్ చేయొద్దు" అని పోలీస్ శాఖ స్పష్టంగా పేర్కొంది. నిజమైన కంపెనీలు ఎప్పుడూ డబ్బులు అడగవని, ఫీజులు చెల్లించమని కోరవని పోలీసులు గుర్తుచేశారు. పోలీసులు సోషల్ మీడియాలో షేర్ చేసిన పోస్టర్‌లో, ఫేక్ ఆఫర్ లెటర్ మోసాలను గుర్తించేందుకు సూచనలు ఇచ్చారు. నిజమైన కంపెనీల అధికారిక వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే సమాచారం పొందాలని, అనుమానాస్పదమైన జాబ్ ఆఫర్‌లు వస్తే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 లేదా cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని సూచించారు.




తెలంగాణ పోలీస్ ప్రజలకు పిలుపునిస్తూ.. "ఉద్యోగం ఆశతో మోసపోవద్దు. ఆఫర్ నిజమా కాదా అని చెక్ చేయడం మీ భద్రతకు మొదటి అడుగు" అని పేర్కొంది.



# సామినేని హంతకుల అరెస్టు చేయాలి..


- డీజీపీకి సీపీఐ (ఎం) రాష్ట్ర నాయకుల వినతి
- రాజకీయ కక్ష్యలతోనే హత్య
- ఘటన జరిగి 12 రోజులైనా కేసును ఛేదించటంలో నిర్లక్ష్యం

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు;**

ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఐ (ఎం) రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హంతకులను అరెస్ట్ చేయాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల రావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెసరకాయల జంగారెడ్డి.. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) బి. శివధర్ రెడ్డికి హైదరాబాదులో మంగళవారం వినతి పత్రం సమర్పించారు. పార్టీకి చెందిన సామినేని రామారావును అక్టోబర్ 31వ తేదీన పాతర్లపాడు గ్రామంలో ఉదయం 5:30 గంటల సమయంలో అతి కిరాతకంగా హత్య చేశారని... ఈ ఘటన జరిగి ఇప్పటికీ 12 రోజులు అవుతున్నా నిందితులను అరెస్టు చేయటంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు. పాతర్లపాడు గ్రామానికి చెందిన బొర్రా ప్రసాద్, కంచుమర్తి రామకృష్ణ, మద్దినేని నాగేశ్వరరావు, కండ్రా పిచ్చయ్య, కొత్తపల్లి వెంకటేశ్వర్లుతో పాటు మరికొందరు గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు.

**రాజకీయ కక్షతోనే హత్య**

రామారావు బతికి ఉంటే సీపీఐ (ఎం)ను ఓడించటం సాధ్యం కాదని భావించి రాజకీయ కక్షలతోనే ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కుట్రపన్ని హత్య చేశారని ఆరోపించారు. హంతకులను నేను స్వయంగా చూశాను.. అని వారి పేర్లతో సహా రామారావు భార్య స్వరాజ్యం పోలీసులకు పిటిషన్ ఇచ్చినా ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయకపోవటాన్ని తప్పు పట్టారు. రామారావు నిస్వార్థ నాయకుడు, వారి స్వగ్రామానికి రెండుసార్లు ఆయన ఏకగ్రీవ సర్పంచిగా ఎన్నికయ్యారని తెలిపారు. రామారావు సతీమణి ఒకసారి గ్రామ సర్పంచ్ గా పనిచేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలోని పేదలకు తమ సొంత భూమిని ఇండ్ల స్థలాల కోసం పంచిన చరిత్ర రామారావు కుటుంబానికి ఉందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిగా రామారావు సేవలు అందించారని, సీపీఐ (ఎం)లో దాదాపు 50 ఏళ్లుగా కొనసాగుతున్నారని వివరించారు. గత కొంతకాలంగా తన స్వగ్రామం పాతర్లపాడు లో ఉంటూ అభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ఇది సహించలేని కాంగ్రెస్ నాయకులు ఆయన ఉంటే రాజకీయంగా తమ మనుగడ సాగదని భావించి, కుట్ర చేసి హత్య చేశారని ఆరోపించారు. ఈ హత్యకు కారణమైన వారందరినీ అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీజీపీకి వినతిపత్రం అందజేశారు.



## నేలకొరిగిన సాహితీ శిఖరం

మాయమవుతున్నాడమ్మా
మనిషన్నవాడు అంటూ
నేటి సమాజ దుస్థితి తెలిపిన
నవోదయుడు
మనిషి బతుకు చుట్టూ ఉన్న చీకటిని
తన గొంతునుంచి ఆశువుగా వల్లె వేసి
పాట రూపంలో పాడిన చైతన్య కారుడు

తెలంగాణ రాష్ట్ర గీతాన్ని రచించి పాడిన
తెలంగాణా ఉద్యమ సూర్యుడు
తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శకమై
వెలుగు రేఖలను నింపిన ఉదయతేజుడు

తన గెయాలతో జన హృదయాలలో
చిరస్థాయిగా నిలిచి పోయిన పాటసారి
చదువు కుంటెనే కవిత్వం కాదు
చదువుకు కవిత్వానికి సంబంధము లేదు
అని తెలిపిన బాటసారి
మా అందే ఎల్లయ్య
మా అందరి గుండెల్లో నీవయ్య

ఆ మహానుభావుని ఆత్మ శాంతించాలని
అక్షర అశ్రునయనాలతో నివాళి



మంజుల పత్తిపాటి
మాజీ డైరెక్టర్
ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218

# ముగిసిన అందెశ్రీ అంత్యక్రియలు

- ప్రభుత్వ లాంఛనాలతో ఘట్కేసర్ స్మృతి వనంలో అంతిమ సంస్కారాలు

**మేడ్చల్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ గేయరచయిత, కవి అందెశ్రీ అంత్యక్రియలు మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించి ముగించారు. తెలంగాణ ఉద్యమానికి ఆత్మగా నిలిచిన అందెశ్రీకి ప్రభుత్వం ఘట్కేసర్ స్మృతి వనంలో అర్ధ ఎకరం (ఇరవై గుంటలు) స్థలం కేటాయించింది. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి, అవుటర్ రింగ్ రోడ్డును ఆనుకుని మేడ్చల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన స్మృతి వనంలో వేలాదిమంది అభిమానులు, కవులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. అంతిమయాత్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుగ్గిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ప్రొఫెసర్ కోదండరాం, విమలక్క, పాశం యాదగిరి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ ఉద్యమానికి ఆత్మగా నిలిచిన అందెశ్రీని కోల్పోవడం రాష్ట్రానికి తీరని లోటు. ఆయన రచించిన 'నిప్పుల వాగు' పుస్తకం తెలంగాణ గర్వకారణం. ప్రతి గ్రంథాలయంలో ఈ గ్రంథాన్ని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటాను. అందెశ్రీకి భారతరత్న పురస్కారం దక్కేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడతాను," అన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యులు, అభిమానులు, కవులు, ప్రజలు అశ్రునయనాలతో "జై తెలంగాణ" నినాదాల మధ్య అంతిమ వీడ్కోలు పలికారు.




# అల్వాల్ గ్రామ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుడి ఖాతాలో 3వ విడత నిధులు జమ

**నిరుపేద లబ్ధిదారుడికి ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం**
**అల్వాల్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు జి. సుదర్శన్ రెడ్డి**

**పెద్దమందడి,నవంబర్11( తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు ప్రభుత్వం నిధులు జమ చేసింది. లబ్ధిదారులలో నాగమ్మ భర్త చిన్న కొండన్న ఖాతాలో మూడవ విడతగా రూ.1,40,000 జమ కాగా, మొదటి విడత నుండి ఇప్పటివరకు మొత్తం రూ.3,40,000 అందినట్లు వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేస్తున్న ఈ చర్య పట్ల గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా అల్వాల్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు జి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల పథకం నిజంగా పేదల కలలను నెరవేర్చే పథకం. ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపశమనం ఇస్తోంది. గ్రామంలో సాంక్షన్ అయిన ప్రతి లబ్ధిదారుడికి ఎటువంటి ఆలస్యం లేకుండా నిధులు జమవుతున్నాయి. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఇళ్లు పూర్తి చేసుకోవాలి అని తెలిపారు.అలాగే, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా వసతి లేని కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు జి. చంద్రశేఖర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కె. బల్రెడ్డి, బి. కురుమూర్తి, నరేందర్, నాగరాజు, ఎస్. రాజు,నరేందర్ రెడ్డి, బలన్న ,తదితరులు పాల్గొన్నారు.





## నాలాపై ఎవరైనా ఆక్రమణలు చేస్తే కఠిన చర్యలు

**మండల సర్వేయర్ సుజాత,ఏడీ శ్రీనివాసులు**

**హసన్ పర్తి,నవంబర్ 11(తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 55వ డివిజన్ భీమారం గ్రామంలోని శ్యామల చెరువు నాలా పాయింట్లను అధికారులు రెండోసారి గుర్తించారు. మండల సర్వేయర్,ఏడి సర్వేయర్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సర్వేలో భీమారం శివారు నుండి లష్కర్ సింగారం శివారు గల సున్నమ్ కుంట వరకు చెరువుకు సంబంధించిన హద్దులను గుర్తించి గుర్తులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే అక్టోబర్ 27న గ్రామస్తుల విజ్ఞప్తి పై అధికారులు చెరువును సందర్శించి మొదటిసారి నాలా పాయింట్లను గుర్తించిన విషయం తెలిసిందే ఆ సర్వే అనంతరం మరింత స్పష్టత కోసం రెండోసారి సర్వే చేపట్టారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నాలాపై ఎవరైనా ఆక్రమణలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని చట్టపరంగా ఎటువంటి రాయితీ ఇవ్వబోమని నాలాపై నిర్మించిన నిర్మాణాలను తొలగిస్తామని హెచ్చరించారు.చెరువుకు సంబంధించిన నాలా పూర్తి హద్దులు, పాయింట్లు ఖరారైన తర్వాత శాశ్వత రికార్డులు సిద్ధం చేస్తామని ఏడి సర్వేయర్,మండల సర్వేయర్ తెలిపారు.భీమారం శ్యామల చెరువు నీటి మత్తడి (నీరు పోయే నాలా) సరిహద్దులు రెండోసారి సర్వే చేసి నిర్ధారించామని త్వరలో సర్వే పూర్తి అవుతుందని తెలిపారు.గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు అధికారుల చర్యను స్వాగతించారు. చెరువును ఆక్రమణల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం ముందడుగు వేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. చెరువు పునరుద్ధరణ జరిగితే గ్రామానికి మళ్లీ పచ్చదనం వస్తుందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల కుమార్,అటికం రవీందర్ గౌడ్,చింతల లక్ష్మణ్,ఉప్పు ప్రభాకర్,కోటగిరి రాధాకిషన్,ఆకుల సదానందం,గుంజ సాయి,నాతి సమ్మయ్య, నాయకపు శ్రీనివాస్,పప్పు రమేష్,నాతి రమేష్,వల్లాల శ్రీధర్,ఉప్పు శివ తదితరులు పాల్గొన్నారు.






## న్యాయవాదుల రక్షణ చట్టం అమలు వరకు పోరాటం కొనసాగుతుంది

- **అలంపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. శ్రీనివాస్**

**పెబ్బేరు,నవంబర్11( తెలంగాణ ముచ్చట్లు):** న్యాయవాదుల రక్షణ చట్టం అమలు జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని అలంపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి. శ్రీనివాస్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన చేపట్టిన ఛలో హైదరాబాద్ పాదయాత్ర మూడవ రోజు పెబ్బేరు చేరుకుంది. ఈ సందర్భంగా వారికి మద్దతుగా అడ్వకేట్ నందిమల్ల త్రినాథ్ సంఘీభావం ప్రకటిస్తూ.. సుమారు 15 కిలోమీటర్ల పాదయాత్రలో పాల్గొన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. జోగులాంబ అమ్మ ఆశీస్సులతో న్యాయవాదుల రక్షణ చట్టం అమలు కోసం ఛలో హైదరాబాద్ పాదయాత్ర ప్రారంభించాం. గత రెండు రోజుల క్రితం అలంపూర్ కోర్టు వద్ద నుండి యాత్ర మొదలుపెట్టాము,అని తెలిపారు. తాజా కాలంలో న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, న్యాయవాదులు వ్యక్తిగత కక్షలు లేకుండా ఇరు పక్షాల న్యాయం కోసం పనిచేస్తారు. అయినా కూడా వారి మీద దాడులు జరగడం తీవ్రంగా ఖండించదగ్గ విషయం, అని అన్నారు. న్యాయవాదులపై దాడులు జరిగితే కోర్టు విధులను బహిష్కరించక తప్పదని, అందుకే రక్షణ చట్టం అత్యవసరమని పేర్కొన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమలులోకి వచ్చే వరకు ఈ పోరాటం కొనసాగుతుంది. మా డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్ వరకు పాదయాత్ర కొనసాగిస్తాము,అని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి, కొల్లాపూర్ ప్రాంతాల న్యాయవాదులు సంఘీభావం తెలియజేశారు. పెబ్బేరు సుభాష్ చౌక్ వద్ద సుభాష్ చంద్ర బోస్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. కార్యక్రమంలో అలంపూర్, వనపర్తి, కొల్లాపూర్ ప్రాంతాల సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.







## ఘనంగా యువజన ఉత్సవాలు..

**జిల్లా యువజన, క్రీడల అధికారి సునీల్ రెడ్డి**

**ఖమ్మం బ్యూరో, నవంబర్- 11, తెలంగాణ ముచ్చట్లు;** జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు స్థానిక శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరు సునీల్ రెడ్డి అన్నారు. 29 వ జాతీయ యువజన ఉత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలను 850 మంది యువ కళాకారులతో జిల్లా స్థాయి కళాకారుల ఎంపికలను విజయవంతంగా నిర్వహించినట్లు యువజన, క్రీడల అధికారి అన్నారు. స్వామీ వివేకానంద చిత్రపటానికి పూల మాలలతో అలంకరించి, జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభించారు. జానపద నృత్యం గ్రూప్ ఫోక్ డ్యాన్స్, జానపద గేయాలు గ్రూప్ ఫోక్ సాంగ్, వ్యాస రచన, పోస్టర్ తయారీ, వక్తృత్వ పోటీలు, కవిత్వం, ఇన్నోవేషన్ మొదలగు అంశాలలో ప్రదర్శనలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఆర్. ఉదయ్ కుమార్, న్యాయనిర్ణేతలు విచ్చేసిన జాన్, మాలతీ నాయుడు , ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ లెక్చరర్లు కే. రవి కుమార్, ఐ. కిరణ్ కుమార్, కే. మధు, బి. శ్రీనివాస్, జి. వీరన్న, యువజన సంఘాల సమితి అధ్యక్షులు ఉమాశంకర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## సత్తుపల్లి పట్టణంలో భద్రతా చర్యలు బలోపేతం.!

- **సంస్థల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి: సీఐ శ్రీహరి.**

**సత్తుపల్లి, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక పట్టణంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని, ప్రజా ప్రదేశాల్లో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులు సూచించారు.

కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రజా భద్రత (చర్యలు) అమలు చట్టం-2013 ప్రకారం సోమవారం సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో పట్టణంలోని షాపింగ్ మాల్స్, హోటల్స్, రెస్టారెంట్లు, పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా సీఐ టి.శ్రీహరి మాట్లాడుతూ, ప్రతి సంస్థలో భద్రతా దృష్ట్యా సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రయల్ రూములు, స్నానాల గదులు వంటి ప్రైవేట్ ప్రాంతాల్లో రహస్య కెమెరాలు అమర్చబడి ఉన్నాయేమో యాజమాన్యాలు స్వయంగా తనిఖీ చేయాలని చెప్పారు.

అన్ని ప్రదేశాలు స్పష్టంగా కనపడేలా కెమెరాలు అమర్చాలని, ఈ చర్యలను 15 రోజులలోగా అమలు చేయాలని యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు.





## పేదలకు ఆరోగ్య భరోసా!

- **మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చొరవ : 83 మందికి రూ. 29 లక్షల సహాయం**

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు;** పేద ప్రజల కష్టాలను తీర్చడమే నిజమైన ప్రజాప్రతినిధి లక్షణమని నమ్ముతూ... తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాలేరు నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. వైద్య సహాయం అవసరమైన లబ్ధిదారుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను వేగవంతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఖమ్మం క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మంత్రి పొంగులేటి కృషితో పాలేరు నియోజకవర్గానికి ప్రతి నెలా దాదాపు రూ. 1 కోటి విలువైన సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు. ఈ నిధులతో నెలకు 400 మందికి పైగా లబ్ధి పొందుతున్నారని వెల్లడించారు. తాజా పంపిణీలో 83 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 29 లక్షల విలువ చేసే చెక్కులను అందజేయడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎంఆర్ఎఫ్ సహాయం అందుకున్న పేద ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు ప్రభుత్వం అందించిన ఈ సహకారం ఎంతో గొప్పదని కృతజ్ఞతలు తెలిపారు.

## ఈ నెల 13న జరిగే బీసీల ధర్మ పోరాట దీక్షను విజయవంతం చెయ్యండి

- **బీసీ జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్,**



**హసన్ పర్తి,నవంబర్ 11(తెలంగాణ ముచ్చట్లు):** బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థ ఎన్నికల్లో 42% రిజర్వేషన్ల సాధనకై బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 13న హన్మకొండ ఏకాశిలా పార్క్ ముందు బీసీల ధర్మ పోరాట దీక్ష వరంగల్ ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు బీసీ జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు.13న జరిగే బీసీల ధర్మ పోరాట దీక్ష కు బీసీ సంఘాల నాయకులు,బీసీ కుల సంఘాల నాయకులు,బీసీ మేధావులు,బీసీ ఉద్యోగస్తులు,ప్రజా సంఘాల నాయకులు,బీసీ మహిళలు,బీసీ యువత, బీసీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని బీసీ ధర్మ పోరాట దీక్షను విజయవంతం చెయ్యాలని పిలుపు నిచ్చారు.

## మృతుల కుటుంబాలకు మంత్రి పొంగులేటి ప్రగాఢ సంతాపం

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు;**

కూసుమంచి మండలంలోని మంగళ్‌తండాకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు బానోత్ మంగ్య నాయక్, ధర్మ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు ధరావత్ రామోజీ నాయక్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. వారి మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. పార్టీ తరఫున తన తరఫున మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు.

## పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలి

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు;**

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఖమ్మం జిల్లా శాఖ మంగళవారం నుండి పెన్షనర్ల పెండింగ్ సమస్యల పరిష్కార నిమిత్తం రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగింది. దీక్షా శిబిరాన్ని జిల్లా శాఖ అధ్యక్షులు మల్లికార్జున రావు గారు ప్రారంభించగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్ గోపీచంద్ కళ్యాణం నాగేశ్వరరావు మాట్లాడుతూ దాదాపు 18 నెలల క్రితం నుండి రిటైర్ అయిన ఉద్యోగులకు రావలసిన బకాయలు చెల్లించకపోగా కనీసం వారు దాచుకున్న జిపిఎఫ్ సొమ్ములు కూడా ఇన్ని నెలపాటు ఇవ్వకపోవడం అనేది దుర్మార్గమైన విషయమని వెంటనే రిటైర్ అయిన ఉద్యోగస్తులకు చెల్లించాల్సిన బకాయిలన్నింటిని చెల్లించాలని నగదురహిత హెల్త్ కార్డులను అందించాలని, 2023 జులై 1నుంచి ఆర్థిక ప్రయోజనాలు కలిగిన పిఆర్సి ప్రకటించాలని, మరియు పెండింగ్ లో ఉన్న 5 డా ర లను విడుదల చేయాలనీ డిమాండ్ చేయడం జరిగింది. నిరాహార దీక్ష లో యు డివిఎస్ రత్నకుమార్, వి అంజయ్య, ఎల్ హరి సింగ్, టి మురళీధర్ రావు, చావా వెంకటేశ్వరరావు కూర్చోడం జరిగింది. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పూర్వ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరాములు , వై రవి కుమార్, మాధవరావు, భారతిలు ప్రసంగించడం జరిగింది.రేవా బాధ్యులు జైరామ్, లక్ష్మయ్య, రామారావు, శ్రీనివాస్ రావులు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేస్తూ మాట్లాడడం జరిగింది.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక

మంగళవారం-11- నవంబర్ 2025

వరంగల్



# టిప్పర్ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన

**ఎల్కతుర్తి, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని డిబిఎల్ రోడ్‌వర్క్స్ కంపెనీ పి.ఆర్వో ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పులి రమేష్, ఎస్సై అక్కెనపెల్లి ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
డ్రైవర్లను ఉద్దేశించి వారు మాట్లాడుతూ — ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలను కలిగి ఉండాలని, నిర్ణీత యూనిఫారం ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, ఓవర్‌స్పీడ్, ఓవర్‌లోడ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. వాహనాల సురక్షిత ప్రయాణం అత్యంత ముఖ్యం అని పేర్కొన్నారు. అలాగే, ఎలాంటి అప్రమత్త పరిస్థితి తలెత్తినప్పుడు వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డిబిఎల్ సంస్థ ఉద్యోగులు, టిప్పర్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.





# అయ్యప్ప భక్తి నడుమ మహా అన్నదానం

**అతిథులుగా ట్రాఫిక్ సిఐ అప్పల నాయుడు, ఎస్ఐ సాగర్**

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు;** ఖమ్మం 60వ డివిజన్ రామన్నపేట బొమ్మ స్వామి గుడి లో అయ్యప్ప స్వాముల భక్తి వైభవం కన్నులపండువగా వెల్లివిరిసింది. మండల దీక్షల ముగింపు సందర్భంగా కాలనీలోని బొమ్మ స్వామి గుడి ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనకీర్తనలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ సిఐ అప్పల నాయుడు, ఎస్ఐ సాగర్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. నిర్వాహకులు వారిని సాంప్రదాయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. స్వామివారి దర్శనం





అనంతరం సిఐ అప్పల నాయుడు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం గురుస్వామి గొలుసుల తిరుమలరావు ఆధ్వర్యంలో జరిగింది. శరణు శరణు అయ్యప్ప నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాలను స్వీకరించారు. ఈ వేడుకలో గురుస్వాములు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, తాడబోయిన రాంబాబు, చింతకాయల అంజయ్య, బరిగల శేఖర్, బార్ అనిల్, కట్ల నరసింహారావు, బండి మనోజ్ తదితరులు స్వామి సేవలో పాల్గొన్నారు.





# రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలి...

**అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**ఖమ్మం బ్యూరో, నవంబర్- 11, తెలంగాణ ముచ్చట్లు;** రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పత్తి, ధాన్య కొనుగోళ్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం తల్లాడ, కల్లూరు మండలాల్లో అదనపు కలెక్టర్ పర్యటించి సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలు, ధాన్య కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, తల్లాడ మండల కేంద్రంలో సిసిఐ చే ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. పత్తి కొనుగోళ్లను పరిశీలించి, ట్యాబ్ ఎంట్రీ, పంట నమోదులను తనిఖీ చేశారు. కొనుగోలుకు వచ్చిన పత్తిని తేమ యంత్రంతో తేమ శాతం పరిశీలన పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు రైతులకు సహకరించి, కొనుగోలు ప్రక్రియ సజావుగా చేపట్టాలన్నారు. తల్లాడ లోని వెంకట పద్మావతి రైస్ మిల్ ను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ధాన్యం దిగుమతి, ట్రక్ షీట్ల నమోదుకు పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే అన్లోడ్ చేసుకోవాలని మిల్లర్ కు సూచించారు. అదనపు కలెక్టర్ తన పర్యటనలో తల్లాడ మండలంలోని నూతనకల్, రంగంబంజర, కల్లూరు మండలంలోని లింగాల, పుల్లయ్య బంజర గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్య కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రోజుకు ఎంతమేర ధాన్యం కేంద్రాలకు వస్తున్నది, ఎంతమేర రవాణా చేస్తున్నది, రైతులకు కల్పిస్తున్న వసతుల గురించి ఆరా తీశారు. రైతులతో మాట్లాడి, కొనుగోళ్లలో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం చూసుకొని కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొని రావాలని రైతులను కోరారు. అధికారులు రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీ వెంట వెంటనే చేపట్టాలని, రైతులకు వారి ధాన్య మొత్తం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదనపు కలెక్టర్ పర్యటన సందర్భంగా జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలత, అధికారులు తదితరులు ఉన్నారు.

# సాహిత్య శిఖరం అందెశ్రీకి జర్నలిస్టుల నివాళి

**ఖమ్మంలో అందెశ్రీకి టిజేఎఫ్ ఘన నివాళులు**

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు;** ప్రజాకవి, తెలంగాణ గేయ రచయిత అందశ్రీ మరణం యావత్తు తెలంగాణ ప్రజానీకానికి తీరని లోటును మిగిల్చిందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావులు అన్నారు. ఖమ్మం నగరంలోని మయూరి సెంటర్లో గల అమర వీరుల స్తూపం వద్ద తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అందెశ్రీకి జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అమరహై అందెశ్రీ, జోహార్ అందెశ్రీ అంటూ జర్నలిస్టులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చిర్రా రవి, సాంబశివరావులు మాట్లాడుతూ.. చదువు రాకపోయినప్పటికీ అద్భుతమైన తెలంగాణ ఉద్యమ పాటలు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గేయాలు రచించి తెలంగాణ స్వరాష్ట్ర మలిదశ ఉద్యమంలో అందెశ్రీ మూలస్తంభంగా నిలిచారని కొనియాడారు. అందెశ్రీ పాటలను గుర్తించిన నేటి తెలంగాణ ప్రభుత్వం జయ జయహే తెలంగాణ గీతాన్ని తెలంగాణ జాతీయ గేయంగా గుర్తింపునిచ్చి పురస్కారం అందించడం అభినందనీయమన్నారు. అలాంటి మహాకవి అందెశ్రీ నేడు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని, ఆయన ఆశయాలను, పోరాట స్పూర్తిని భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనం దరిపై ఉందని గుర్తు చేశారు. నివాళులు అర్పించిన వారిలో టీజేఎఫ్ జిల్లా నాయకులు రాంశెట్టి విజేత, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్, వనం నాగయ్య, మందుల ఉపేందర్, కలవకొలను హరీష్‌రాజు, మందటి వెంకటరమణ, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, టివిస్ చక్రవర్తి, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్ష కార్యదర్శులు యలమందల జగదీష్, కరీష అశోక్, కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, జిల్లా నాయకులు తిరుపతి రావు, హుస్సేన్, గోవింద్, దూసరి కళ్యాణ్, మదర్ సాహెబ్, సాయి, సుధాకర్, గణేష్, యాదగిరి, ఉపేందర్, వంగూరి ఈశ్వరి, వుల్లోజు రమేష్, శ్రీధర్, నరేష్, ఇస్సంపల్లి వెంకటేశ్వర్లు, దండాల ప్రభాకర్ రెడ్డి, మందా వెంకటేశ్వర్లు, శంకర్, మనోజ్, కొండలు, సతీష్, హరి, బాబు, రాజు, పెంటి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.








# జమాఅతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో నైబర్స్ రైట్స్ క్యాంపెయిన్

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు;** ఆదివారం ఖమ్మం పట్టణంలో అజీజ్ సందులో గల జమాఅతె ఇస్లామీ హింద్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా అధ్యక్షతన జరిగిన సభ్యుల మరియు కార్యకర్తల సమావేశం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాదిక్ అహ్మద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నవంబర్ 2130 వరకు నైబర్స్ రైట్స్ క్యాంపెయిన్ (పొరుగు వారి హక్కులు) నిర్వహిస్తుందన్నారు ఈ ఉద్యమం యొక్క ముఖ్య ఉద్దేశం ప్రతి కార్యకర్త పొరుగువారి హక్కుల గురించి అవగాహన పెంచుకోవాలి. పొరుగువారు ఒకరితో ఒకరు సంబంధాలను చక్కదిద్దుకోవడానికి మరియు స్నేహపూర్వక మరియు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించుకోవాలి, వీధిలో, షాపింగ్ కేంద్రాలలో, ప్రయాణిస్తున్నప్పుడు మరియు వర్చువల్ ప్రపంచంలో పొరుగువారి గురించి అవగాహన కల్పించాలని అన్నారు. ఈ ఉద్యమంలో పురుషులు మరియు మహిళ కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జమాఅతె ఇస్లామి హింద్ నార్త్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్ షరీఫ్, సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, వెస్ట్ అధ్యక్షులు అబ్దుస్ సుబుర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మా అన్జుమ్, సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్, నార్త్ అధ్యక్షురాలు హుస్సేన్ బి ,సౌత్ అధ్యక్షురాలు నాజియా తబస్సుం ,వెస్ట్ అధ్యక్షురాలు ఫర్జానా సభ్యులు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మాజీ మంత్రి విజయరామారావును పరామర్శించిన బీజేపీ నాయకులు

**హైదరాబాద్,నవంబర్11(తెలంగాణ ముచ్చట్లు):** బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ గుండె విజయరామారావును జనగాం జిల్లాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు.ఇటీవల మోకాలికి చికిత్స చేయించుకున్న విజయరామారావు ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా జనగాం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సౌడ రమేష్ ఆధ్వర్యంలో బీజేపీ సీనియర్ నాయకులు అంకుగారి శశిధర్ రెడ్డి, చిల్పూర్ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్, దూల్మిట్ట మండల అధ్యక్షుడు యాదగిరి, మద్దూర్ మండల అధ్యక్షుడు మోకు ఉదయ్ రెడ్డి తదితరులు ఆయనను కలిశారు.



# ఈ నెల 13న నర్సంపేటలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్మ పోరాట దీక్ష

**నర్సంపేట,నవంబర్11(తెలంగాణ ముచ్చట్లు):**

బీసీ జేఏసీ రాష్ట్ర పిలుపు మేరకు బీసీల హక్కుల సాధన కోసం నర్సంపేటలో ఈ నెల 13న ధర్మ పోరాట దీక్ష నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు, నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్, బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం రాజ్యాంగ సవరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ ఆదేశాల ప్రకారం అష్టాంగ ఆందోళనల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా బీసీలు దీక్షలు చేపట్టనున్నారని వివరించారు.
నర్సంపేటలో ఏమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రహరీ గోడ ముందు జరిగే ఈ ధర్మ పోరాట దీక్షలో నియోజకవర్గంలోని అఖిలపక్ష నాయకులు, బీసీ జేఏసీ నేతలు, బీసీ సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ సంఘాలు పాల్గొని దీక్షను విజయవంతం చేయాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు, జేఏసీ వైస్ చైర్మన్ కడారి సురేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నూరి రవి ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి మరుపల వీరస్వామి కురుమ, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య, పట్టణ కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, బీసీ నాయకులు మేరుగు శంకర్, లింగం గుండు బాబ్జీ, కొలిపాక సుధాకర్, శీరంశెట్టి రాజేందర్, పెరక మద్దెల కొమురయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# తెలంగాణ మట్టి వాసనకు ప్రతిబింబం అందెశ్రీ కవిత్వం

- **టియూడబ్ల్యూజె(ఐజెయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాం నారాయణ**
- **ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో అందెశ్రీకి ఘన నివాళులు**

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు;** తెలంగాణ మట్టి వాసనకు ప్రతిబింబం అందెశ్రీ కవిత్వమని టియూడబ్ల్యూజె(ఐజెయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా రచయిత, కాలమిస్ట్ అందెశ్రీ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు జర్నలిస్టులు నివాళులర్పించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం అధ్యక్షతన జరిగిన సభలో కె.రాంనారాయణ మాట్లాడుతూ నిరుపేద, నిరక్షరాస్యుడైన అందెశ్రీ గొర్రెల కాపరి నుండి ప్రజాకవిగా ఎదిగాడని అన్నారు. పల్లె జీవితంలోని కన్నీళ్లు, కష్టాలు, ప్రకృతిలో మార్పులు, మనుషుల బాధలను లోతుగా గమనించడం, అనుభవించడం ద్వారా అందెశ్రీ సహజసిద్ధమైన, హృదయాన్ని కదిలించే ఆసు కవిత్వంతో అతితక్కువ సమయంలోనే ప్రజాకవిగా ఎదిగారన్నారు. తన పాటలతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాంక్షను రగిల్చి లక్షలాది మందిని ఉద్యమ చైతన్యం వైపు నడిపించారన్నారు. ఆయన రాసిన జయజయహే తెలంగాణ' గీతం రాష్ట్ర గీతమైందన్నారు. ఆయన జీవితం, సాహిత్యం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జర్నలిస్టులు కృషి చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మైసా పాపారావు, స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, యూనియన్ నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర కోశాధికారి ఏలూరి వేణు, ప్రెస్‌క్లబ్ కోశాధికారి కళ్యాణ్, ఉపాధ్యక్షులు గండారపు రామారావు, సహాయ కార్యదర్శి శివాజీ, నాయకులు మందా వెంకటేశ్వర్లు, టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ గ్లోబల్ హైస్కూల్లో జాతీయ విద్యా దినోత్సవం

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 11, తెలంగాణ ముచ్చట్లు;** చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో ఉన్నటువంటి శ్రీ గ్లోబల్ హైస్కూల్లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137 వ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం ను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఇనుకుల్ల దివాకర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటి నెహ్రూ నాయకత్వంలోని క్యాబినెట్లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారని, ఆయన పుట్టినరోజు సందర్భంగా జాతీయ విద్య దినోత్సవం వేడుకలు నిర్వహిస్తారని వివరించడం జరిగింది. హిందీ, అరబిక్, బెంగాలీ, ఇంగ్లీష్ భాషలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పండితుడని, 11 సంవత్సరాల పాటు విద్యా శాఖ మంత్రిగా పనిచేశారని, దేశంలోని అన్ని వర్గాల ప్రజలు చదువుకోవాలని ఆశయంతో కులమత బేధాలు లేకుండా పనిచేశారని అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1992లో భారతరత్న అవార్డు అందజేసి గౌరవించిందని వివరించడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులందరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని విద్యలో రాణిస్తూ సమాజ సేవ చేయాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్మెంట్ అయినటువంటి వాహిని, తిరుపతి రెడ్డి, సుధాకర్ రెడ్డి మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# లాభాలతో ప్రారంభమై నష్టాల్లోకి..




సోమవారం ఓ మోస్తారు లాభాలను ఆర్జించిన దేశీయ సూచీలు మంగళవారం కూడా అదే జోష్‌తో ప్రారంభమయ్యాయి. అయితే కాసేపటికే ఆరంభ లాభాలు ఆవిరై సూచీలు నష్టాల బాట పట్టాయి. వివిధ కంపెనీలు ప్రకటిస్తున్న త్రైమాసిక ఫలితాలు నిరాశజనకంగా ఉండడం, భవిష్యత్తు టార్గెట్‌ను కూడా తగ్గించడం వల్ల మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాల వల్ల కూడా ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో కదలాడుతున్నాయి.గత సెషన్ ముగింపు (83, 535)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం 150 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత నష్టాల్లోకి జారిపోయింది. ప్రస్తుతం ఉదయం 10:25 గంటల సమయంలో సెన్సెక్స్ 275 పాయింట్ల నష్టంతో 83, 259 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 83 పాయింట్ల నష్టంతో 25, 491 వద్ద కొనసాగుతోందిసెన్సెక్స్‌లో వోడాఫోన్ ఐడియా, పెర్సిస్టెంట్, అంబార్ ఎంటర్‌ప్రైజెస్, సోలార్ ఇండస్ట్రీస్, భారత్ డైనమిక్స్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సెర్వ్, బ్రిటానియా, హడ్కో, ఏబీ క్యాపిటల్ మొదలైన షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 150 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 240 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.70గా ఉంది.

# ఆచార్య సేవగా – భగవత్, భాగవత సేవ

శ్రీ పశుపతినాథ్ దేవస్థానం అర్చకుడు శ్రీ సదానిరంజన్‌కు సన్మానం

**ఎల్కతుర్తి నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం వల్బాపూర్ గ్రామంలోని శ్రీ పశుపతినాథ్ దేవస్థానం లో "ఆచార్య సేవగా - భగవత్, భాగవత సేవ" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

శ్రీ భగవద్రామానుజాచార్యుల ఉపదేశాల స్ఫూర్తితో, "మాధవసేవగా - సర్వప్రాణి సేవ" భావాన్ని ఆచరణలో పెట్టడం లక్ష్యంగా వికాస తరంగిణి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు శ్రీ సిద్ధాంతి సదానిరంజన్ గారిని ఘనంగా సన్మానించారు. సమానత్వంతో కూడిన ధార్మిక జీవనాన్ని ప్రజల్లో విస్తరింపజేసిన దయాసముద్రుడు శ్రీ రామానుజాచార్యుల



బోధనలతో ప్రేరణ పొందిన ఈ కార్యక్రమం విశేషంగా నిలిచింది.

108 దివ్యదేశాలతో కూడిన సమతామూర్తి శ్రీ రామానుజాచార్యుల దివ్య విగ్రహం స్థాపన, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో జరగడం విశిష్ట ఘట్టంగా పేర్కొన్నారు నిర్వాహకులు.

ఈ మహాకార్యాన్ని స్మరించుకుంటూ, 2025 అక్టోబర్ 22 నుండి 25 వరకు శ్రీరామనగర్‌లో జరిగే 69వ తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంలో ఈ సేవా కార్యక్రమాన్ని వికాస తరంగిణి సంకల్పించింది.

కార్యక్రమం ప్రధాన ఉద్దేశం —— శాస్త్రోక్త పద్ధతిలో ఆరాధన జరగని చిన్న దేవాలయాల్లో భగవత్సేవ, భాగవతసేవ ను సక్రమంగా అందించడం. ఆగమ శాస్త్రాల ప్రకారం ఆరాధనలో అర్చకుల పాత్ర ఎంతో ముఖ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శాస్త్రీయ, శాస్త్రోక్త ఆరాధనను ప్రజలకు చేరవేయడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీ సిద్ధాంతి సదానిరంజన్, శివాలయ కమిటీ చైర్మన్ గంజి భావనఋషి, కడెం రమేష్, సుందర్ రావు, రాజేందర్, రోజా, అరుణ, శోభా, కవితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రం చౌరబడింది...భద్రత చీలిపోయింది!

- **ఉగ్రవాదం మళ్లీ తలెత్తింది...**
- **భద్రతా వ్యవస్థలు నిద్రపోయాయా?**

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు కేవలం ఒక ఘటన కాదు, భద్రతా వ్యవస్థలపై మోపిన ముక్కుసూటి ప్రశ్న. దేశాన్ని కదిలించిన ఈ ఘటనలో దాదాపు పదిమంది నిరపరాధులు ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచం కళ్లల్లో భారత రాజధాని అనే ప్రతిష్టకు ఇది బీటలు వేసే దెబ్బ. అతి రక్షణలో ఉండాల్సిన జోన్‌లోనే ఇలాంటి విస్ఫోటనం ఎలా జరిగింది? ఎక్కడ పొరబాటు జరిగింది? ఎవరు జాగ్రత్తలు విస్మరించారు? ఇవి నేటి భారతదేశం అడగాల్సిన ప్రశ్నలు.

ఈ బ్లాస్ట్ తర్వాత కేంద్ర ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించక తప్పలేదు. కానీ ఇటువంటి భద్రతా హెచ్చరికలు పేలుడు తర్వాత ప్రకటించడం ప్రజలను ఆశ్వాసపరచడం కన్నా, ప్రభుత్వ వైఫల్యాలను మరింత బట్టబయలు చేస్తోంది. దేశ భద్రతను కాపాడాల్సిన ఇంటెలిజెన్స్ శాఖ కళ్ల ముందే రాజధానిలో బాంబులు పేలితే, ప్రజలు ఏ సంస్థను నమ్మాలి? ప్రతి దాడి తర్వాత అదే మాటలు.. "దర్యాప్తు చేస్తాం", "దోషులను శిక్షిస్తాం".



కానీ ఫలితం? నిశ్శబ్దమే!

ఈ ఘటనలో ఎన్ఐఏ రంగంలోకి దిగడం తప్పనిసరి అయ్యింది. కానీ ఎన్ఐఏ, ఐబీ, స్థానిక పోలీసు వ్యవస్థ ఇవన్నీ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉగ్రవాదం నేడు సోషల్ మీడియా ద్వారా వ్యూహాలు రూపొందించే స్థాయిలో అడుగులు మార్చుకుంటోంది. కానీ మన భద్రతా వ్యవస్థలు ఇప్పటికీ పాత పద్ధతుల్లోనే కొనసాగుతున్నాయనిపిస్తోంది. రాజధానిలో కార్ బ్లాస్ట్ జరిగేంతవరకూ ఇంటెలిజెన్స్‌కు కణమాత్రం సమాచారం రాకపోవడం అసహజం కాదు. ఆందోళన కలిగించే విషయం.



ఫరీదాబాద్‌లో జరిగిన ఆపరేషన్‌లో 2,900 కిలోల పేలుడు పదార్థాలు, ఏకే47లు, పిస్టళ్లు స్వాధీనం కావడం ఉగ్రవాద శక్తులు దేశ మణికట్టు మీదే కుట్రలు పన్నుతున్నాయన్నది మరోసారి నిరూపిస్తోంది. ఆ ముఠా పట్టుబడకపోయి ఉంటే పరిస్థితి ఎలాంటి భయానక రూపం దాల్చేదో ఆలోచించడమే భయంకరం. ఇదంతా జరుగుతున్నా "దేశం సురక్షితం" అని చెప్పడం ప్రజల్ని మోసం చేయడమే అవుతుంది.

అత్యంత విచారకరమైన విషయం ఎన్నికల ముందు ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఇప్పుడు పద్ధతి మాదిరిగా మారిపోయింది. బీహార్ ఎన్నికల రెండో దశకు కేవలం ఒకరోజు ముందు ఈ పేలుడు జరగడం, రాజకీయ అంతర్గత కుట్రలకా? దేశాన్ని అస్థిరపరిచే బాహ్య శక్తులకా? లేక రెండింటి మేళవింపుకా? అనే అనుమానాలను మరింత వేగంగా పెంచుతోంది. ఏ కోణం అయినా ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు.

ఢిల్లీ ఎర్రకోట అంటే దేశ గౌరవం. పార్లమెంట్, ముఖ్య భద్రతా ప్రాంతాలే లక్ష్యాలైపోతున్నాయంటే ఇక దేశంలోని మిగిలిన ప్రాంతాల పరిస్థితి ఏంటి? ఉగ్రవాదం మతం, జాతి, పార్టీ తేడాలు చూడదు. కానీ దానిని అరికట్టాల్సినపుడు మాత్రం మన రాజకీయ నాయకులు బొమ్మలాటలతో ఒకరిపై ఒకరు తప్పులు మోపే దుర్గుణం ఆపాలి. దాడి జరిగినప్పుడు మాత్రమే కఠిన మాటలు చెప్పడం కాదు, ముందే చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలు కాపాడడమే నిజమైన నేతృత్వం.

ఉగ్ర ముప్పును అడ్డుకోవాలంటే మాటలకాదు, అమలులో బలమైన చర్యలు అవసరం. ఇంటెలిజెన్స్ వ్యవస్థను సమూలంగా బలోపేతం చేయాలి. ఉగ్రవాదంపై రాజకీయ బిజినెస్ ఆపాలి. భద్రతను ఓటు బ్యాంకుల రాజకీయాలకు బలికొద్దు. దేశ సరిహద్దులు మాత్రమే కాదు. రాజధాని గుండెల్లోనూ భద్రతా చట్రం రంధ్రాలతో నిండిపోయింది. ఈ దాడి.. ఆ రంధ్రాలు బయటపెట్టింది.

ఈ బ్లాస్ట్ మనకు గుర్తు చేసిన కఠిన సత్యం ఒక్కటే ఉగ్రవాదం ఇంకా ఉంది. అది మారిపోయింది. రూపం మార్చుకుంది. టెక్నాలజీతో మరింత అడుగులు ముందేసింది. ప్రశ్న ఏంటంటే: మన భద్రతా వ్యవస్థలు ఆ మార్పుకు సిద్ధమా? లేక ఉగ్రవాదం మళ్లీ ప్రాణాలు కొల్లగొట్టిన తర్వాతే మేల్కొనే 'సంస్కృతి'ని కొనసాగిస్తామా?

ఈ ఘటనను ఒక "ఘటన"గా కాకుండా.. చివరి హెచ్చరికగా తీసుకోవాలి. రాజధాని రక్తమోడితే దేశం మౌనంగా ఉండదు. భద్రత అంటే ప్రచార నినాదాలు కాదు, ప్రభుత్వాల తొలి బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చే ధైర్యం ఇప్పుడు చూపాల్సిన సమయం ఇది.

# డిజిటల్ గోల్డ్ పెట్టుబడిపై గందరగోళంలో మదుపరులు!

రికార్డుస్థాయిలో పరుగులు పెడుతున్న బంగారం ధరలు.. గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కున్న రకరకాల మార్గాలపట్ల మదుపరులను విపరీతంగా ఆకర్షింపజేస్తున్నాయి. ఈ క్రమంలోనే కొందరు సంప్రదాయ పద్ధతిలో పసిడి నాణేలు, బిస్కట్లు, కడ్డీలు, నగలను కొనేందుకు ఇష్టపడుతుంటే.. ఇంకొందరు డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లు, బాండ్లు, సెక్యూరిటీలవైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ఇదే అదనుగా ఇటీవలికాలంలో డిజిటల్ మోసాలు విజృంభిస్తున్నాయి. దీంతో సెక్యూరిటీస్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) అప్రమత్తమైంది. తాజాగా డిజిటల్ గోల్డ్‌సాధనాల్లో పెట్టుబడుల గురించి మదుపరులను హెచ్చరించిన విషయమూ తెలిసిందే. సెబీ నియంత్రిత గోల్డ్ ప్రొడక్ట్స్‌తో పోల్చితే అవి భిన్నంగా ఉంటాయని, అమాయక ఇన్వెస్టర్లు రిస్క్‌లో పడే ప్రమాదం ఉందన్న సంగతీ విదితమే. దీంతో ఇన్నాళ్లూ డిజిటల్ గోల్డ్‌పై పెట్టుబడులు పెడుతూ వచ్చిన వారంతా ఇప్పుడు ఒక్కసారిగా భయాందోళనలకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే తమ పెట్టుబడులను అలాగే ఉంచుదామా? లేక వెనక్కి తీసుకుందామా? అన్న డైలమాలో పడిపోయారు.




**ఇంతకీ సెబీ ఏం చెప్పింది?**

'కొన్ని డిజిటల్, ఆన్‌లైన్ వేదికలు ఆయా 'డిజిటల్ గోల్డ్/ఈగోల్డ్ ప్రొడక్ట్స్'లో పెట్టుబడులు పెట్టేలా ఇన్వెస్టర్లకు రకరకాల ఆఫర్లు చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. భౌతిక బంగారంలో పెట్టుబడి కోసం ప్రత్యామ్నాయంగా ఉన్నదే ఈ డిజిటల్ గోల్డ్. అయితే మా నియంత్రణలో ఉన్న గోల్డ్ ప్రొడక్ట్స్‌తో చూస్తే.. సదరు డిజిటల్ గోల్డ్ ప్రొడక్ట్స్ భిన్నమైనవి. ఎందుకంటే అవి సెక్యూరిటీలుగాగానీ లేదా కమోడిటీ డెరివేటివ్‌లుగాగానీ నమోదు కాలేదు. మా పరిధిని దాటి అవన్నీ పనిచేస్తూ ఉంటాయి. ఒకవేళ రేపటి రోజున అవి మూతబడితే మదుపరులు నష్టపోయినట్టే. సెబీ మదుపరి రక్షణ వ్యవస్థ కింద మీరు ఉండరు కాబట్టి చట్టరీత్యా మేమూ ఏమీ చేయలేని పరిస్థితి. కనుక మదుపరులు ఈ రకమైన పెట్టుబడుల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి' అని సెబీ గత వారం ఓ సర్క్యులర్‌లో స్పష్టం చేసింది

**ఇదీ సంగతి..**

గోల్డ్, గోల్డ్ సంబంధిత సాధనాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే మదుపరులు సెబీ రెగ్యులేటెడ్ గోల్డ్ ప్రొడక్ట్స్‌ను పరిశీలించవచ్చు. మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్‌పై ట్రేడయ్యే ఎక్స్చేంజ్ ట్రేడెడ్ కమోడిటీ డెరివేటివ్ కాంట్రాక్టులు, మ్యూచువల్ ఫండ్స్ ఆఫర్ చేసే గోల్డ్ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు), స్టాక్ ఎక్స్చేంజీల్లో ట్రేడయ్యే ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసిప్ట్స్ (ఈజీఆర్‌లు) వంటివి అందుబాటులో ఉన్నాయని సెబీ చెప్తున్నది. అలాగే సెబీ రెగ్యులేటెడ్ ఇంటర్మీడియరీల ద్వారానే ఈ పెట్టుబడులకు వెళ్లాలని, అప్పుడే తమ విధివిధానాలకు లోబడి మదుపరుల పెట్టుబడులు రక్షణాత్మకంగా ఉంటాయని సూచిస్తున్నది.

**రూ.1,300 పెరిగిన బంగారం ధర**

బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. సోమవారం ఒక్కరోజే ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాములు రూ.1,300 పుంజుకొని రేటు రూ.1,25,300ను తాకింది. కిలో వెండి విలువ కూడా రూ.2,460 ఎగసి రూ.1,55,760కి ఎగబాకింది. ఇక హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం రూ.1,800 పెరిగి రూ.1,23,820గా నమోదైంది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) రూ.1,650 అందుకొని రూ.1,13,500కు చేరుకున్నది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 83.12 డాలర్లు ఎగసి 4 వేల డాలర్ల మార్కుకు ఎగువన 4,082.84 డాలర్ల వద్ద ముగిసింది. అలాగే సిల్వర్ 49.93 డాలర్లకు పెరిగింది. కాగా, అమెరికా స్థూల ఆర్థిక గణాంకాలు బలహీనంగా ఉండటంతో మదుపరులు తమ పెట్టుబడుల రక్షణార్థం పసిడి వైపునకు కదులుతుండటమే ధరల పెరుగుదలకు కారణమని ట్రేడర్లు మార్కెట్ సరళిని విశ్లేషిస్తున్నారు.

**మరి నిపుణులు ఏం చెప్తున్నారు?**

సెబీ నియంత్రిత ప్రొడక్ట్స్‌లో మీ డిజిటల్ గోల్డ్ పెట్టుబడులు లేకపోతే వాటిని తక్షణమే ఉపసంహరించుకోండి. దీనివల్ల మదుపరులకు కొంతమేర నష్టం వాటిల్లవచ్చు. అయితే 100 శాతం నష్టపోయే ప్రమాదం నుంచి మాత్రం తప్పించుకుంటారు. ఆకర్షణీయ యాప్‌ల మాయలోపడి, విశ్వసనీయతను గాలికి వదిలేయవద్దు. గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఈగోల్డ్ రిసిప్ట్‌లు సెబీ రెగ్యులేటెడ్ ప్రొడక్ట్స్. వీటిలో పెట్టుబడులు సురక్షితం. చట్టపరమైన రక్షణ కూడా ఉంటుంది.

# రూ.2.30 లక్షల బెనిఫిట్ ఇచ్చే కేంద్రం స్కీం..

**నాలుగు నెలల్లో కోటికిపైగా ఖాతాలు!**




దేశంలోని ప్రతి కుటుంబానికి కనీసం ఒక్క బ్యాంక్ అకౌంట్ అయినా ఉండాలన్న ఉద్దేశంతో.. కేంద్ర ప్రభుత్వం గతంలో తీసుకొచ్చిన గొప్ప స్కీమ్ ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన . నరేంద్ర మోదీ నేతృత్వంలో తొలిసారి అధికారంలోకి రాగానే.. ఈ స్కీమ్ తీసుకొచ్చింది. అప్పట్లోనే కోట్లల్లో అకౌంట్లు తెరవడంతో సరికొత్త రికార్డు సృష్టించింది. కొన్నేళ్లలోనే 50 కోట్లకుపైగా అకౌంట్లు తెరవడంతో అపూర్వ విజయం సాధించింది. అయితే ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రచారంలో భాగంగా.. 4 నెలల వ్యవధిలోనే కోటికిపైగా కొత్త అకౌంట్లు తెరిచారు. అర్హత ఉన్న పౌరులు అందరినీ కీలక ఆర్థిక పథకాల పరిధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా 'నేషన్‌వైడ్ ఫైనాన్షియల్ ఇంక్లూషన్ శాచురేషన్ క్యాంపెయిన్' ను 4 నెలల పాటు నిర్వహించింది. ఈ ప్రచారం అక్టోబర్ 31తో ముగిసింది.ఈ క్రమంలోనే కొత్తగా 1.11 కోట్ల పీఎం జన్ ధన్ ఖాతాలు ప్రారంభమయ్యాయని కేంద్ర ఆర్థిక శాఖ వివరాలు వెల్లడించింది. ఇదే సమయంలో ఇతర ఆర్థిక పథకాలైన.. ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజన కింద 2.86 కోట్ల కొత్త ఖాతాలు, ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద 1.4 కోట్ల వరకు కొత్త అకౌంట్లు తెరిచారని స్పష్టం చేసింది. మరో 44.43 లక్షల వరకు అటల్ పెన్షన్ యోజన కింద నమోదు చేసుకున్నారని వెల్లడించింది. జన్ ధన్ యోజన పథకం విషయానికి వస్తే.. దీనిని ప్రధాని నరేంద్ర మోదీ 2014 ఆగస్ట్ 15న ప్రకటించగా.. అదే నెల 28 నుంచి నిర్వహణలోకి వచ్చింది. ఇప్పటివరకు 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ క్రమంలోనే 11 ఏళ్లలో రికార్డు స్థాయిలో సుమారు 57 కోట్ల వరకు అకౌంట్లు తెరిచారు. వీటిల్లో రూ. 2.70 లక్షల కోట్లకుపైగా డిపాజిట్లు ఉన్నట్లు కొద్ది రోజుల కిందట కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. ఇక అకౌంట్ తీసుకొని పదేళ్లు దాటిన వారికి మళ్లీ కేవైసీ చేసుకోవాలని ఆర్బీఐ ఇటీవల స్పష్టం చేసింది.ఈ స్కీమ్ ప్రయోజనాల విషయానికి వస్తే.. వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాల్ని.. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా ప్రజలకు నేరుగా అందించడంలో ఈ అకౌంట్లు ఉపయోగపడ్డాయి. ఈ అకౌంట్ హోల్డర్స్.. లోన్లు, సామాజిక భద్రత, పొదుపు, పెట్టుబడులకు వీటిని ఉపయోగిస్తున్నారు. 35 కోట్లకుపైగా ఫ్రీ రూపే డెబిట్ కార్డుల్ని అందించడం ద్వారా డిజిటల్ లావాదేవీలకు కూడా మద్దతు పెరిగింది.జన్ ధన్ ఖాతా అనేది జీరో బ్యాలెన్స్ అకౌంట్. అంటే అకౌంట్లో బ్యాలెన్స్ లేకపోయినా నిర్వహించుకోవచ్చు. ఇంకా ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం ఉంది. ఇక్కడ ఖాతాలో డబ్బుల్లేకపోయినా రూ. 10 వేల వరకు ముందస్తుగా తీసుకునే సౌలభ్యం ఉంది. ఈ అకౌంట్ ఉన్న వారికి రూ. 2 లక్షల విలువైన ప్రమాద బీమా ఉంది. అదనంగా మరో రూ. 30 వేల జీవిత బీమా వర్తిస్తుంది. మొత్తం రూ. 2.30 లక్షల బెనిఫిట్ వర్తిస్తుందన్నమాట.

# క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉందా?

**టెన్షన్ వద్దు.. జస్ట్ ఒక్క నెలలో పెంచుకోవచ్చు! ఎలాగంటే..?**




క్రెడిట్ స్కోరు మీ ఆర్థిక ఆరోగ్యాన్ని ప్రతిబింబిస్తుంది, రుణాల ఆమోదం, వడ్డీ రేట్లను ప్రభావితం చేస్తుంది. మంచి స్కోరు (700+), తక్కువ వడ్డీకి సులభ రుణాలకు కీలకం. 300500 చెడ్డదిగా పరిగణిస్తారు. సకాలంలో బిల్లులు, EMIలు చెల్లించడం, క్రెడిట్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా కేవలం ఒక నెలలో మీ స్కోరును మెరుగుపరచుకోవచ్చు.క్రెడిట్ స్కోరు ఒక వ్యక్తి ఆర్థిక చరిత్రను ప్రతిబింబిస్తుంది. క్రెడిట్ స్కోరును చూస్తే ఒక వ్యక్తి తన ఆర్థిక నిర్వహణ, బిల్లులను ఎలా చెల్లిస్తాడో ఒక ఆలోచన వస్తుంది. క్రెడిట్ స్కోరు ఒక విధంగా ఒక వ్యక్తి ఆర్థిక ఆరోగ్యాన్ని ప్రతిబింబిస్తుంది. మంచి క్రెడిట్ స్కోరు కలిగి ఉండటం చాలా మంచిదని భావిస్తారు. మీకు మంచి క్రెడిట్ స్కోరు ఉంటే, మీరు బ్యాంకు నుండి సులభంగా రుణం పొందవచ్చు. అలాగే బ్యాంకులు మీకు తక్కువ వడ్డీ రేటుకు రుణం ఇవ్వగలవు. మీకు తక్కువ క్రెడిట్ స్కోరు ఉంటే బ్యాంకులు తరచుగా రుణాలను నిరాకరిస్తాయి లేదా అధిక వడ్డీ రేటుకు రుణాలు ఇస్తాయి. మంచి క్రెడిట్ స్కోరు అంటే ఏమిటి?

**మంచి క్రెడిట్ స్కోరు..?**

క్రెడిట్ స్కోరు అంటే మూడు అంకెల స్కోరు. ఉత్తమ క్రెడిట్ స్కోరు 700లేదా అంతకంటే ఎక్కువ. అదే సమయంలో 300, 500 మధ్య క్రెడిట్ స్కోరు చెడ్డదిగా పరిగణిస్తారు. మీ క్రెడిట్ స్కోరు 600 చుట్టూ ఉంటే అది యావరేజ్ క్రెడిట్ స్కోర్‌గా భావిస్తారు.

**నెలలో క్రెడిట్ స్కోర్ పెంచుకోవచ్చా?**

చెడు క్రెడిట్ స్కోరు 1 నెలలో మెరుగుపడుతుందా? లేదా మీ క్రెడిట్ స్కోరును మెరుగుపరచడానికి ఎంత సమయం పడుతుంది? అనే డౌట్ చాలా మందిలో ఉంటుంది. అయితే కేవలం ఒక్క నెలలోనే మీ క్రెడిట్ స్కోర్ పెంచుకోవచ్చు.

**ఇలా ట్రై చేయండి**

మీ క్రెడిట్ స్కోర్‌ను పెంచుకోవడానికి మీ బిల్లులన్నింటినీ సకాలంలో చెల్లించండి. మీ రుణ EMIలను సకాలంలో చెల్లించండి. మీ క్రెడిట్ కార్డ్ బిల్లులను సకాలంలో చెల్లించండి, ఆలస్యం చేయకండి. ఎల్లప్పుడూ మీ క్రెడిట్ కార్డ్ పరిమితి కంటే తక్కువ ఖర్చు చేయండి. మళ్లీ మళ్లీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవడం మానుకోండి.క్రెడిట్ వినియోగ నిష్పత్తి క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేస్తుంది, కానీ మీరు మీ బిల్లులను చెల్లించడంలో ఆలస్యం చేస్తే, అది మీ క్రెడిట్ స్కోర్‌ను కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. మీ క్రెడిట్ వినియోగ నిష్పత్తిని తక్కువగా ఉంచడం, కానీ సమయానికి చెల్లించకపోవడం వల్ల మీ క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. దీనితో పాటు మీరు జరిమానా కూడా చెల్లించాల్సి ఉంటుంది.

# కోలీవుడ్‌ని ఫాలో అవుతోన్న జక్కన్న...

**గ్లోబ్ ట్రోటర్ ఈవెంట్‌లో వాటికి నో పర్మిషన్**




టాలీవుడ్ లో విజువల్ స్పెక్టాకిల్‌కు పునాది వేసిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబుతో కలిసి ఓ పాన్ వరల్డ్ మూవీ తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు భారతీయ సినీ ప్రపంచంలోనే అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్‌గా ఈ చిత్రం నిలిచింది. బాహుబలి, ఆర్ఆర్ఆర్ వంటి సినిమాలతో భారత సినిమాను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లిన రాజమౌళి, ఈసారి తన స్కేల్‌ను మరింత పెంచుతున్నారని సమాచారం.ఈ సినిమా మహేష్ కెరీర్‌లో 29వ చిత్రం. అడ్వెంచర్ యాక్షన్ జానర్‌లో, ఇండియానా జోన్స్ తరహాలో ప్రపంచం నలుమూలలా జరిగే యాక్షన్ సీక్వెన్స్‌తో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ ఇది. కథ, సన్నివేశాలు, పాత్రల బిల్డ్ అప్ అన్నీ రాజమౌళి మార్క్‌లోనే ఉండబోతున్నాయని తెలుస్తోంది. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ మూవీలో 'కుంభ' అనే పవర్‌ఫుల్ రోల్‌లో నటిస్తుండగా.. ఇటీవల విడుదల చేసిన ఆయన ఫస్ట్‌లుక్ సెన్సేషన్‌గా మారింది. ఈ చిత్ర నిర్మాణ విలువలు, లొకేషన్లు, VFX వర్క్ అన్నీ హాలీవుడ్ స్టాండర్డ్స్‌కి దగ్గరగా ఉంటాయని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ సినిమాకు సంబంధించిన భారీ గ్లోబల్ ట్రాటర్ ఈవెంట్ నవంబర్ 15న జరగబోతున్నట్లు ఇప్పటికే అఫీషియల్‌గా ప్రకటించారు. అయితే ఈ ఈవెంట్‌కు సంబంధించి ఒక ఆసక్తికర విషయం వినిపిస్తోంది. ఈ కార్యక్రమానికి కెమెరాలు అనుమతించరట. మీడియా లైవ్ టెలికాస్ట్ లేకుండా ఈవెంట్ జరగొచ్చని, అక్కడ జరిగిన ప్రతి అంశం ప్రత్యేక బృందం ద్వారా రికార్డ్ చేసి, ఎడిట్ చేసి ఆ తర్వాత పబ్లిక్‌కు రిలీజ్ చేసే అవకాశం ఉందని సమాచారం. ఈ పద్ధతిని తమిళ ఇండస్ట్రీ ఎప్పటి నుంచో ఫాలో అవుతోంది. అక్కడ సినిమాలకి సంబంధించి ఏదైనా పెద్ద ఈవెంట్ జరిగితే ప్రత్యేకంగా షూట్ చేసి రెండు మూడు వారాల తర్వాత దాన్ని టీవీలో గానీ, అధికారిక యూట్యూబ్ ఛానల్‌లో గానీ టెలికాస్ట్ చేస్తుంటారు. ఈలోగా ఈవెంట్‌కి సంబంధించి వీడియోలు లీక్ కాకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.తాజాగా SSMB29 గ్లోబల్ ట్రోటర్ ఈవెంట్ విషయంలోనూ రాజమౌళి ఇదే పద్ధతిని ఫాలో కానున్నారని టాక్ వినిపిస్తోంది. ఇప్పటివరకు రాజమౌళి చేసే ప్రతి సినిమా మార్కెటింగ్‌కు ఒక కొత్త ప్రమాణాన్ని సెట్ చేసింది. బాహుబలి ప్రమోషన్ స్ట్రాటజీ, ఆర్ఆర్ఆర్ గ్లోబల్ క్యాంపెయిన్.. ఇప్పుడు అదే స్టైల్లో SSMB29 ప్రమోషన్ ఎలా ఉంటుందోనని ఇండస్ట్రీ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఈ ఈవెంట్లో టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు మహేశ్‌బాబు లుక్ పోస్టర్‌ని రిలీజ్ చేస్తారని తెలుస్తోంది. ఈ ఈవెంట్ హీట్‌ను మరింత పెంచుతూ మేకర్స్ ఒక స్పెషల్ సాంగ్ రిలీజ్ చేశారు. కీరవాణి సంగీత సారథ్యంలో శృతిహాసన్ స్వరంతో వచ్చిన ఈ మెలోడిక్-ట్రావెల్ వైబ్ ఉన్న సాంగ్ సోషల్ మీడియాలో దూసుకుపోతోంది. మహేష్‌బాబు అడ్వెంచర్ జర్నీని సూచిస్తూ వచ్చిన ఈ పాటలో ధైర్యం, ప్రపంచ అన్వేషణ చేసే స్పిరిట్, హీరో విజన్‌ను సూచించేలా లిరిక్స్ వినిపిస్తున్నాయి. మొత్తమ్మీద గ్లోబల్ ట్రోటర్ ఈవెంట్ భారత సినిమా ప్రతిష్ఠ, మార్కెట్, విజువల్ కల్చర్ అన్నింటినీ మరో స్థాయికి తీసుకెళ్లేలా రాజమౌళి ప్లాన్ చేస్తున్నాడని తెలుస్తోంది.



# నటుడు ధర్మేంద్ర మృతి అంటూ వార్తలు.. హేమా మాలిని తీవ్ర ఆగ్రహం!

ప్రముఖ బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మృతి చెందారంటూ మంగళవారం ఉదయం మీడియాలో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలను ఖండించింది ధర్మేంద్ర భార్య నటి హేమ మాలిని. ధర్మేంద్ర చికిత్సకు స్పందిస్తూ కోలుకుంటున్న సమయంలో ఆయన మరణించారంటూ వచ్చిన పుకార్లపై ఆమె తన ఆవేదనను వ్యక్తం చేసింది.ధర్మేంద్ర మృతి చెందారంటూ వస్తున్న వార్తలపై హేమా మాలిని స్పందిస్తూ.. ప్రస్తుతం జరుగుతున్నది క్షమించరానిది! చికిత్సకు స్పందించి, కోలుకుంటున్న వ్యక్తి గురించి బాధ్యత కలిగిన ఛానెల్‌లు తప్పుడు వార్తలను ఎలా ప్రచారం చేయగలవు? ఇది అత్యంత అగౌరవంగా, బాధ్యతారాహిత్యంగా ఉంది. దయచేసి మా కుటుంబానికి ప్రైవసీతో పాటు అవసరానికి తగిన గౌరవం ఇవ్వండి అని హేమమాలిని రాసుకొచ్చింది. ప్రస్తుతం ధర్మేంద్ర ముంబైలోని బ్రీచ్ క్యాండీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా.. ధర్మేంద్ర ఆరోగ్యంపై ఇప్పటికే అతడి కూతురు నటి ఈషా డియోల్ సోషల్ మీడియా వేదికగా క్లారిటీనిచ్చింది.

# హీరోగా 'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు..

**-షూటింగ్ కంప్లీట్.. డబ్బింగ్ షురూ.!**

'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమాతో దర్శకుడిగా తొలి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్న అభిషాన్ జీవింత్ నటుడిగా కొత్త ప్రయాణం మొదలుపెడుతున్న విషయం తెలిసిందే. ప్రోడక్షన్ నెం4 అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే షూటింగ్ కుడా పూర్తి చేసుకుంది. ఈ సినిమాలో మలయాళం నటి అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తుండగా.. మదన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాకు రజనీకాంత్ కూతురు సౌందర్య రజనీకాంత్ నిర్మిస్తుంది. అయితే తాజాగా ఈ మూవీ అప్‌డేట్‌ను ప్రకటించారు మేకర్స్. ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ చేసుకుని డబ్బింగ్ షురూ చేసినట్లు చిత్రబృందం ప్రకటించింది. త్వరలోనే ఈ సినిమా టీజర్‌తో పాటు విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించబోతుంది. ఇక ఈ సినిమాకు 'కరెక్టెడ్ మచ్చి'అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లుగా వార్తలు వచ్చాయి.






# కీర్తి సురేశ్ 'రివాల్వర్ రీటా' తేదీ ఖరారు!

విభిన్న పాత్రలతో దూసుకుపోతున్న అగ్ర కథానాయిక కీర్తి సురేశ్ నటిస్తున్న తాజా చిత్రం 'రివాల్వర్ రీటా'. ఈ సినిమాకు కె. చంద్రు దర్శకత్వం వహిస్తుండగా.. సీనియర్ నటి రాధికా శరత్ కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉన్న ఈ చిత్రం నుంచి తాజాగా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఈ సినిమాను నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు వెల్లడించారు.కీర్తి సురేశ్ ఈ సినిమాలో 'రీటా' అనే సామాన్య మధ్యతరగతి యువతి పాత్రలో కనిపించనుంది. అనూహ్య పరిస్థితుల కారణంగా ఆమె తుపాకీ (రివాల్వర్) పట్టుకోవాల్సి వస్తుంది. ఆ తర్వాత ఆమె ఎలాంటి సాహసాలు, సవాళ్లు ఎదుర్కొంది అనేది ప్రధాన కథాంశం. ఇది కామెడీ అంశాలతో కూడిన పక్కా యాక్షన్ థ్రిల్లర్ చిత్రంగా రాబోతుంది.




# 'ఆంధ్ర కింగ్ తాలూకా' నుంచి టైటిల్ ప్రోమో..

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా వస్తున్న తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా' . ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ప్రమోషన్స్‌లో భాగంగా మూవీ నుంచి 'ఫస్ట్ డే ఫస్ట్ షో' సాంగ్ ప్రోమోను చిత్ర బృందం మంగళవారం విడుదల చేసింది. దీనికి సంబంధించిన పూర్తి పాట ఈ బుధవారం విడుదల కాబోతుంది. రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో ఉపేంద్ర కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. పి. మహేశ్‌బాబు ('మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేమ్) దర్శకత్వం వహిస్తున్నాడు.

బుధవారం-12- నవంబర్ 2025

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అంగోలా స్వాతంత్ర్య వేడుకల్లో భారత రాష్ట్రపతి

- 50వ స్వాతంత్ర్య వార్షికోత్సవం సందర్భంగా లువాండాలో వైభవం
- అంగోలా సైనిక–సాంస్కృతిక సంప్రదాయాల ప్రదర్శనకు సాక్ష్యమైన రాష్ట్రపతి
- భారత–అంగోలా స్నేహబంధం మరింత బలపడుతుందన్న నమ్మకం





అంగోలా స్వాతంత్ర్యం 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని లువాండాలో నిర్వహించిన వేడుకల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. అంగోలా అధ్యక్షుడు జోవ్ మాన్యువెల్ గోన్సాల్వెస్ లోరెన్సో ఆహ్వానం మేరకు రాష్ట్రపతి ముర్ము ఈ వేడుకల్లో పాల్గొన్నట్లు రాష్ట్రపతి భవన్ ప్రకటించింది. ప్రాచా డా రిపబ్లికా వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగోలా సైనిక దళాలు, సాంస్కృతిక బృందాలు ఆకట్టుకునే ప్రదర్శనలు అందించాయి. అంగోలా స్వాతంత్ర్య పోరాటం, జాతీయ గర్వం, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే ఈ వేడుకల్లో రాష్ట్రపతి ముర్ము, అధ్యక్షుడు లోరెన్సోతో కలిసి ప్రధాన అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ, "అంగోలా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు ప్రపంచానికి ప్రేరణ. స్వాతంత్ర్యం కేవలం దేశానికి మాత్రమే కాదు, ప్రతి పౌరుడి ఆత్మగౌరవానికి ప్రతీక" అని పేర్కొన్నారు. అంగోలా ప్రజలకు భారత ప్రజల తరఫున శుభాకాంక్షలు తెలుపుతూ, ఇరుదేశాల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్-అంగోలా దేశాలు పలు రంగాల్లో వాణిజ్యం, విద్య, సాంకేతిక, ఇంధన, వ్యవసాయ రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందిస్తున్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమం ఇరుదేశాల స్నేహబంధానికి నూతన మైలురాయిగా నిలిచిందని అంగోలా మీడియా వ్యాఖ్యానించింది.

# గబీహార్‌లో ఎగ్జిట్ పోల్స్ ప్రకారం ఘన విజయం దిశగా బీజేపీ కూటమి

- మహాగట్బంధన్‌కు నిరాశ, 'జన్ సురాజ్' ప్రభావం లేనట్టే
- మహిళా ఓటర్ల మద్దతుతో ఎన్డీయే వైపు స్పష్టమైన ఊపు

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఎన్డీయే ప్రభంజనం సృష్టించబోతోందని తాజా ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. నేడు ముగిసిన రెండో విడత పోలింగ్ అనంతరం విడుదలైన దాదాపు అన్ని సర్వేలు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి భారీ ఆధిక్యం ఉన్నదని వెల్లడించాయి. ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమి అయిన మహాగట్బంధన్‌కు ఈసారి ఓటర్ల తీర్పు ప్రతికూలంగా ఉన్నట్లు అంచనా వేస్తున్నాయి. వివిధ జాతీయ సర్వే సంస్థలు ప్రకటించిన వివరాల ప్రకారం, ఎన్డీయే కూటమికి 130 నుంచి 167 సీట్లు దక్కే అవకాశం ఉన్నట్లు సూచించాయి. మరోవైపు, మహాగట్బంధన్ 70 నుంచి 108 స్థానాల వరకు పరిమితం కావచ్చని తెలిపాయి. మొత్తం 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 122 సీట్ల మేజిక్ ఫిగర్ అవసరం. ఆ లక్ష్యాన్ని ఎన్డీయే సునాయాసంగా అధిగమించనుందని అన్ని ఎగ్జిట్ పోల్స్ ఒకే స్వరంతో చెబుతున్నాయి. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని 'జన్ సురాజ్' పార్టీ ప్రభావం చూపుతుందని ఊహించినా, ఫలితాలు నిరాశ కలిగించాయని సర్వేలు సూచిస్తున్నాయి. చాలా సర్వేలు ఆయన పార్టీకి 0-5 సీట్ల మధ్యే దక్కే అవకాశం ఉందని పేర్కొన్నాయి. విశ్లేషకుల ప్రకారం, 'పీకే ఫ్యాక్టర్' బీహార్ ఎన్నికల్లో అసలు ప్రభావం చూపలేదని తేల్చారు. మ్యాట్రిజ్ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం, మిథిలాంచల్, భాగల్‌పూర్, మగధ్ ప్రాంతాల్లో ఎన్డీయే వేవ్ కొనసాగిందని తెలిపింది. ముఖ్యంగా, మహిళా ఓటర్ల మద్దతు ఎన్డీయేకు కీలకంగా మారిందని సర్వే స్పష్టం చేసింది. దాదాపు 65 శాతం మహిళలు, 51 శాతం ఓబీసీలు, 49 శాతం ఎస్సీ ఓటర్లు ఎన్డీయే వైపు మొగ్గు చూపినట్లు వెల్లడించింది. మొత్తం రెండు విడతల్లో పోలింగ్ పూర్తయిన బీహార్‌లో నవంబర్ 6న 121 స్థానాలకు, నవంబర్ 11న మిగిలిన 122 స్థానాలకు ఓటింగ్ జరిగింది. పోలింగ్ ముగిసిన వెంటనే వెలువడిన ఎగ్జిట్ పోల్స్ ఎన్డీయేకు అనుకూలంగా ఉండగా, తుది ఫలితాలు ఏ దిశగా వెళ్తాయో నవంబర్ 14న జరిగే ఓట్ల లెక్కింపు తర్వాతే స్పష్టమవుతుంది.





# భూటాన్‌లో ప్రధాని మోదీకి ఘన స్వాగతం

**భారత్–భూటాన్ మైత్రి బంధానికి కొత్త ఊపు**

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భూటాన్ పర్యటనకు చేరుకున్నారు. భూటాన్‌లోని పారో అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే భూటాన్ ప్రధాన మంత్రి షేరింగ్ టోబ్గే స్వయంగా ఆయనను ఆత్మీయంగా స్వాగతించారు. రెండు దేశాల జెండాలు రెపరెపలాడుతుండగా, గౌరవ వందనాలతో మోదీకి రాజసమాన ఆతిథ్యం అందించారు. భూటాన్ ప్రజలు సాంప్రదాయ దుస్తుల్లో రోడ్ల వెంట నిలబడి "లాంగ్ లివ్ ఇండియా-భూటాన్ ఫ్రెండ్షిప్" అంటూ హర్షధ్వానాలు చేశారు.



భారత్-భూటాన్ స్నేహ సంబంధాలను కొత్త దిశగా తీసుకెళ్లే ఈ పర్యటనలో మోదీ పలు ముఖ్యమైన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ముఖ్యంగా భూటాన్ నాలుగో రాజు మహారాజా జిగ్మే సింగే వాంగ్‌చుక్ 70వ జన్మదిన వేడుకలకు హాజరవ్వడం ఈ పర్యటనకు అంతర్జాతీయ ప్రాధాన్యతను తెచ్చిపెట్టింది. ఆయనకు అంకితభావంతో పాలన సాగించిన మహారాజా స్ఫూర్తిగా నిలుస్తారని మోదీ పేర్కొననున్నట్లు సమాచారం.

ఇక ఈ పర్యటనలో ఆర్థిక, విద్య, సాంకేతిక, సాంస్కృతిక రంగాల్లో భారత్-భూటాన్ మధ్య పలు కీలక ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ఎడ్యుకేషన్, యూత్ ఎక్స్ఛేంజ్ వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయని వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటన రెండు దేశాల భవిష్యత్ సంబంధాలకు కొత్త దశ ఆరంభమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భూటాన్ పర్యటన సందర్భంగా మోదీ భూటాన్ రాజ కుటుంబాన్ని, ప్రభుత్వ ప్రతినిధులను, అలాగే భారతీయ సమాజ సభ్యులను కూడా కలవనున్నారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న ఆయన, భారత్ సహకారంతో నిర్మితమవుతున్న పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా సమీక్షించనున్నారు.

భూటాన్ ప్రజలు భారత ప్రధాని పర్యటనను పండుగలా జరుపుకుంటున్నారు. పారో, థింపూ వీధులన్నీ భారత జెండాలతో అలంకరించబడ్డాయి. భూటాన్ మీడియా కూడా ఈ పర్యటనను చారిత్రాత్మకంగా అభివర్ణిస్తోంది.






# భారత్–శ్రీలంక సంయుక్త సైనిక విన్యాసం 'మిత్రశక్తి–2025' ఘనంగా ప్రారంభం

- బెలగావిలో ప్రారంభమైన 11వ ఎడిషన్
- శాంతి మిషన్లలో సంయుక్త శిక్షణ ప్రధాన లక్ష్యం
- భారత్–శ్రీలంక రక్షణ బంధం మరింత బలపడనుంది

భారత్-శ్రీలంక మైత్రి బంధానికి ప్రతీకగా నిలిచే సంయుక్త సైనిక వ్యాయామం 'మిత్రశక్తి-2025' ఘనంగా ప్రారంభమైంది. కర్ణాటకలోని బెలగావి ఫారిన్ ట్రైనింగ్ నోడ్‌లో ప్రారంభమైన ఈ 11వ ఎడిషన్ సైనిక విన్యాసం నవంబర్ 10 నుంచి 23 వరకు కొనసాగనుంది. ప్రారంభ కార్యక్రమంలో ఇరుదేశాల సైనిక అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ వ్యాయామం ద్వారా ఇరుదేశాల మధ్య సైనిక సమన్వయం, అవగాహన, స్నేహ సంబంధాలు మరింత బలపడతాయని అధికారులు తెలిపారు.



ఈ విన్యాసం ప్రధాన ఉద్దేశ్యం శాంతి భద్రతా మిషన్లలో సంయుక్తంగా పాల్గొనగల సామర్థ్యాన్ని పెంచడం. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగే శాంతి మిషన్లకు అవసరమైన ఉపసాంప్రదాయ యుద్ధాలు, జాయింట్ టాక్టికల్ డ్రిల్స్, కమాండ్ కోఆర్డినేషన్, సాంకేతిక నైపుణ్యాల మార్పిడి వంటి అంశాలపై ఈ శిక్షణ కేంద్రీకృతమై ఉంది. రెండు దేశాల సైనికులు కలిసి వివిధ సన్నివేశాల్లో తాత్కాలిక యుద్ధ వ్యూహాలను అభ్యసించనున్నారు.

'మిత్రశక్తి' వ్యాయామం ద్వారా ఇరుదేశాల మధ్య ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, గ్రామీణ భద్రతా విధానాలు, పౌర రక్షణ వ్యూహాలు, సహాయక దళాల సమన్వయం వంటి అంశాల్లో కొత్త దిశలు ఆవిష్కరించబడనున్నాయి. సైనిక సంబంధాలు మాత్రమే కాకుండా, వ్యూహాత్మక మైత్రి, సమాచార మార్పిడి, సాంకేతిక సహకారం వంటి రంగాల్లో కూడా ఈ విన్యాసం విస్తృత ప్రభావం చూపనుంది. భారత్-శ్రీలంక రక్షణ బంధం గత కొన్నేళ్లుగా నిరంతరం బలపడుతూ వస్తోంది. రెండు దేశాల మధ్య పరస్పర విశ్వాసం, శాంతి స్ఫూర్తి, సహకార తత్వం ఈ వ్యాయామం ద్వారా మరింత పెరుగుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 'మిత్రశక్తి-2025' కేవలం సైనిక విన్యాసం మాత్రమే కాదు, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, మైత్రి విలువలను ప్రతిబింబించే వేదికగా నిలుస్తోంది.

# ఢిల్లీ పేలుడు ఘటనపై పాక్ మీడియా ప్రధాన కవరేజ్

- డాన్, జియో న్యూస్, ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ సహా పత్రికల్లో ఫ్రంట్ పేజ్ స్టోరీ
- భారత ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించినట్లు రాసిన పాక్ మీడియా
- ఉగ్రవాద నిరోధక చట్టం కింద దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్న కథనాలు

దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం సాయంత్రం జరిగిన భారీ పేలుడు దేశాన్ని కుదిపేసింది. చారిత్రాత్మక ఎర్రకోట సమీపంలోని సుభాష్ మార్గ్ మెట్రో స్టేషన్ వద్ద సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. భారత మీడియా సంస్థలు ఈ ఘటనను విస్తృతంగా కవర్ చేసి ఫ్రంట్ పేజీల్లో ప్రధానంగా ప్రచురించాయి. ఈ ఘటనకు అంతర్జాతీయ ప్రతిస్పందన కూడా లభించింది. ముఖ్యంగా పాకిస్థాన్ మీడియా సంస్థలు ఢిల్లీ పేలుడు ఘటనను తమ పత్రికల ఫ్రంట్ పేజీల్లో ప్రచురించాయి. డాన్, జియో న్యూస్,



ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్, ద న్యూస్ ఇంటర్నేషనల్, పాకిస్థాన్ టుడే వంటి ప్రముఖ పత్రికలు, టెలివిజన్ ఛానల్స్ తమ వెబ్‌సైట్లలో ఈ ఘటనను ప్రధాన కథనంగా ఉంచాయి. పాక్ మీడియా కథనాల ప్రకారం, ఎర్రకోట సమీపంలోని కారులో అనుమానాస్పద పేలుడు సంభవించిందని పేర్కొంది. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హోంమంత్రి అమిత్‌షా, ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారని కూడా వివరించింది. ఉగ్రవాద నిరోధక చట్టం కింద ఈ కేసులో దర్యాప్తు జరుగుతోందని ఢిల్లీ పోలీసులను ఉదహరిస్తూ రాసుకొచ్చింది. భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా హైఅలర్ట్ ప్రకటించినట్లు పాక్ మీడియా తెలిపింది. అంతర్జాతీయ స్థాయిలో ఈ ఘటనపై చర్చ నడుస్తుండగా, పేలుడు వెనుక ఉగ్రవాద కుట్ర ఉన్నదనే అనుమానాలపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఢిల్లీ పోలీసు, NIA సంయుక్తంగా విచారణ కొనసాగిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# బీజాపూర్‌లో భీకర ఎన్‌కౌంటర్

- ఆరుగురు మావోయిస్టుల మృతి
- నలుగురు గాయపడినవారు అరెస్టు
- ఇంద్రావతి నేషనల్ పార్క్‌లో ఉదయం 10 గంటల నుంచి కాల్పులు కొనసాగినట్లు సమాచారం
- భారీ ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనంఈ చేసుకున్న భద్రతా దళాలు



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మంగళవారం ఉదయం మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య ఉద్ధృతమైన ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఇంద్రావతి నేషనల్ పార్క్ పరిసరాల్లో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనను బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ధ్రువీకరించారు. ఎన్‌కౌంటర్ ఉదయం పది గంటల సమయంలో ప్రారంభమై గంటల తరబడి కొనసాగిందని అధికారులు తెలిపారు. భద్రతా దళాలు నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ లో భాగంగా అడవుల్లో శోధన చేపట్టగా, అక్కడ దాక్కున్న మావోయిస్టులు ఆకస్మికంగా కాల్పులు ప్రారంభించినట్లు సమాచారం. ప్రతిగా డీఆర్జీ, ఎస్టీఎఫ్, బీజాపూర్, దంతేవాడ దళాలు దీటుగా బదులిచ్చాయి. సెర్చ్ ఆపరేషన్ ముగిసిన అనంతరం భద్రతా బలగాలు సంఘటనా స్థలాన్ని పరిశీలించగా, ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. వారితో పాటు ఇన్సాస్ రైఫిల్స్, స్టెన్‌గన్, 303 రైఫిల్స్, పేలుడు పదార్థాలు, ఇతర యుద్ధ సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పీ మాట్లాడుతూ, ఎన్‌కౌంటర్ ప్రాంతంలో అదనపు భద్రతా బలగాలను పంపినట్లు తెలిపారు. గాయపడ్డ నలుగురు నక్సల్స్‌ను అరెస్టు చేసి బీజాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్పీ యాదవ్ వెల్లడించారు. భవిష్యత్‌లో ఇలాంటి నక్సల్ దాడులను అరికట్టేందుకు బలగాలు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in